www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 28-3-2025 | పేజీలు: 6 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 86 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం,తిథి: చతుర్దశి రా.7.56 తదుపరి అమావాస్య, నక్షత్రం: పూర్వాభాద్ర రా.10.09 తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం: తె. ఉ. 7.45, అమృతఘడియలు: మ.2.57-4.23, దుర్ముహూర్తం: ఉ.8.41-9.30, మ.12.44-1.33, రాహుకాలం: ఉ. 10.30-12.00, సూర్యోదయం: 6.16, సూర్యాస్తమయం: 6.24 | రాజమహేంద్రవరం సిటీ

Rajamahendravaram | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శుక్రవారం | 28-3-2025
Rajamahendravaram |Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
| రాజమహేంద్రవరం సిటీ

అక్షర.. లక్షలు!

'ఆంధ్రజ్యోతి' పాఠకాభిమానం

ఒక్కటా రెండా ఏకంగా గత 23 ఏళ్లుగా నిరాటంకంగా 'ఆంధ్రజ్యోతి' ప్రయాణం దిగ్విజయంగా కొనసాగుతోంది. ప్రజా సమస్యలపై మా అక్షరం మీ ఆయుధం అంటూ పోరాడడమే కాదు.. పాఠకులకు ఆనందం పంచుతోంది.. వారి ఆదరణ చూరగొంటోంది.. పత్రికకు, పాఠకులకు మధ్య ఉన్న అనుబంధాన్ని పదిలం చేసుకుంటోంది. అక్షరాలా లక్షలాది రూపాయల బహుమతులు.. కాదు కాదు.. ఏకంగా కోటి విలువైన బహుమతులను తమ అభిమాన పాఠకులకు అందిస్తోంది. దీనిలో భాగంగా ఏటా మాదిరిగానే ఈ ఏడాదీ కార్ అండ్ బైక్ రేస్ పేరుతో ఆంధ్రజ్యోతి లక్కీడ్రా కార్యక్రమాన్ని చేపట్టింది. నాలుగు నెలలపాటు కూపన్లు ప్రచురించి, పాఠకుల నుంచి అందుకున్న ఆ కూపన్లను లక్కీడ్రాగా గురువారం రాజమహేంద్రవరం జిల్లా కార్యాలయంలో నిర్వహించింది. జిల్లా నుంచి ముగ్గురు విజేతలను ఎంపిక చేసింది. మొదటి మూడు స్థానాలు కోనసీమ పాఠకులనే వరించగా.. ఇక జిల్లాలో 100మందిని కన్సొలేషన్ బహుమతులకు ఎంపిక చేసింది.. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలను ఎంపిక చేశారు. విజేతలైన పాఠకులకు బ్రాంచి మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు ఫోన్‌లో సమాచారం అందించారు.


కూపన్ తీస్తున్న ఎస్పీ

2లో


ఆంధ్రజ్యోతి అదృష్టవంతుల ఎంపిక ఇలా : ఉమ్మడి జిల్లా యూనిట్ కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి' లక్కీడ్రా తీసి తొలి ముగ్గురు విజేతలను ప్రకటిస్తున్న ఎస్పీ నరసింహకిశోర్, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, బ్రాంచి మేనేజర్ శ్రీనివాసరావు, ఎడిషన్ ఇన్‌చార్జి జీహెచ్‌వీ మంగేష్, సర్క్యులేషన్ మేనేజర్ గోపాలకృష్ణ, యాడ్స్ మేనేజర్ కృష్ణారావు, స్టాఫ్ రిపోర్టర్లు సత్యనారాయణ, రమేష్


కూపన్ తీస్తున్న ఎమ్మెల్యే

ప్రథమ బహుమతి : బైక్
విజేత : టీఎన్‌వీఎస్.సూర్యనారాయణమూర్తి, మండపల్లి
ద్వితీయ బహుమతి : ఫ్రిడ్జ్
విజేత : అడబాల సత్యనారాయణ, శృంగవరప్పాడు
తృతీయ బహుమతి : టీవీ
విజేత : ములస అప్పలరాజు, రామచంద్రపురం

నాకు లక్ తగిలింది!



మా అమ్మాయికి జన్మించే బిడ్డ అదృష్టం ఇది. ఎందుకంటే మేం మా అమ్మాయికి సీమంతం చేస్తుండగా నాకు ఫోన్ వచ్చింది.. ఆంధ్రజ్యోతి లక్కీడ్రాలో జిల్లా ప్రథమ బహుమతి గెలుచుకున్నారని.. ఆనందం వేసింది.. చాలా ఏళ్లుగా ఆంధ్రజ్యోతి పాఠకుడిని .. ప్రతి ఏడాది డ్రా కోసం ఎదురు చూస్తుంటా.. ఈ ఏడాది ఆ లక్ నాకు తగిలింది.
- సూర్యనారాయణమూర్తి, మండపల్లి, కోనసీమ

తెలుగు భాషను కాపాడుతున్న ఆంధ్రజ్యోతి



తెలుగు భాషను 'ఆంధ్రజ్యోతి' పత్రిక కాపాడుతోంది. ఎన్నో దేశాలు మాతృభాషను బతికించుకునేందుకు కృషి చేస్తున్నాయి. తెలుగు భాషకు ప్రాధాన్యత ఇస్తున్న ఆంధ్రజ్యోతితో నాకెంతో అనుబంధం ఉంది. ఈ రోజు నన్ను లక్కీడ్రాకు గెస్ట్‌గా పిలవడం ఆనందంగా ఉంది. నేను చదువుకునే రోజుల్లో ఆంధ్రజ్యోతి పత్రిక చదివిన ఘటనలు కళ్లెదుట కదలాడుతున్నాయి.
- నరసింహకిశోర్, ఎస్పీ, తూర్పుగోదావరి జిల్లా

నిజాన్ని నిర్భయంగా రాసేది ఆంధ్రజ్యోతి



నాకు దిక్సూచి ఆంధ్రజ్యోతి.. నా నియోజకవర్గంలో ఆంధ్రజ్యోతి జిల్లా కార్యాలయం ఉండడం ఆనందంగా ఉంది. సమాజ స్థాపనలో ఆంధ్రజ్యోతి చేస్తున్న కృషి అభినందనీయం. ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయడంలోనూ, ప్రజల సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ఆంధ్రజ్యోతి చేస్తున్న కృషి అనిర్వచనీయమైంది.. నిజాన్ని నిర్భయంగా రాయగలిగింది ఆంధ్రజ్యోతి పత్రిక మాత్రమే.
- బత్తుల బలరామకృష్ణ, ఎమ్మెల్యే, రాజానగరం

తీరు మారలేదు!

పిఠాపురం రూరల్ పోలీస్‌స్టేషన్




ఇటీవల రూ.20వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన పిఠాపురం రూరల్ ఎస్‌ఐ, ప్రైవేటు డ్రైవర్

» ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరవు
» ప్రతి పనికి చేయి తడపాల్సిందే
» ప్రైవేటు వ్యక్తుల ద్వారా లావాదేవీలు, సెటిల్మెంట్లు
» ఏసీబీకి పట్టుబడిన ఎస్‌ఐ
» నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు డ్రైవర్ నియామకం
» పిఠాపురం పోలీసుల తీరుపై విమర్శలు
» డిప్యూటీ సీఎం పవన్ ఆగ్రహించినా బేఖాతర్

అదే తీరు. ప్రైవేటు వ్యక్తుల ద్వారా లావాదేవీలు, సెటిల్మెంట్లు. ఏ పని కోసం వచ్చినా చేయి తడపాల్సిందే. డాక్యుమెంట్ పోయిందని వస్తే డబ్బులు చేతిలో పడేవరకూ ఆ సర్టిఫికెట్ బాధితుల చేతికి అందదు. ఎస్‌ఐ తిరిగే అధికారిక పోలీసు జీపులో పలు కేసుల్లో అనుమానితుడిగా ఉన్న వ్యక్తి డ్రైవర్‌గా పనిచేస్తూ ఉన్నా ఉన్నతాధికారులకు పట్టదు. సాక్షాత్తూ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్వయంగా పోలీస్‌స్టేషన్ల వేదికగా జరుగుతున్న సెటిల్మెంట్లను ప్రస్తావించి పోలీసుల పనితీరుపై బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేసినా పరిస్థితి మారలేదు సరికదా. మరింత అధికమైంది. చివరికి ఒక ఎస్‌ఐ, అతడివద్ద డ్రైవర్‌గా ఉన్న వ్యక్తి ఏసీబీకి చిక్కేవరకూ వెళ్లిందంటే ఇక్కడ పోలీసుల పనితీరు ఎలా ఉందో విధితమవుతోంది.

(ఆంధ్రజ్యోతి, పిఠాపురం)

పిఠాపురంలో చోరీలు అధికంగా జరుగుతున్నాయని, ఈవ్‌టీజింగ్, గంజాయి విక్రయాలు అధికమయ్యాయని ఫిర్యాదులు వచ్చినా పోలీసులు పట్టించుకోవడం లేదు. పోలీస్‌స్టేషన్ల వేదికగా ప్రైవేటు వ్యక్తులు సెటిల్మెంట్లు చేస్తున్నారు. గంజాయి బ్యాచ్ ఆగడాలు అధికమయ్యాయి. పోలీసులు ఉదాసీనంగా ఉంటున్నారంటూ జనవరి 10న పిఠాపురంలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో పాల్గొనేందుకు వచ్చిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ బహిరంగంగా వ్యాఖ్యానించడంతోపాటు కలెక్టర్, ఎస్పీల సమక్షంలోనే పోలీసుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఏం జరిగింది

పవన్ వాఖ్యల తర్వాత పిఠాపురం పట్టణంలో పోలీసులు వాహనాల తనిఖీలు, డ్రంక్‌అండ్ డ్రైవ్ కేసుల పేరుతో రెండువారాలపాటు హడావుడి చేశారు. సంక్రాంతి సమయంలో అదీ మూడు మద్యం షాపులు ఉన్న పిఠాపురంలోని ఉప్పాడ సెంటర్ దగ్గర వీరు చేసిన హడావుడి అప్పట్లో విమర్శలకు గురైంది. పూట గస్తీ పేరుతో కొన్ని రోజులు తిరిగి మళ్లీ ఆ విషయాన్ని మర్చిపోయారు. ఇప్పుడు పిఠాపురం పట్టణంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా ఉన్నా, బైక్‌లపై యువకులు విన్యాసాలు చేస్తున్నా, మద్యం, గంజాయి మత్తులో రహదారులపై హల్‌చల్‌చేస్తూ పలువురిని గాయపరుస్తున్నా వారిని నియంత్రించే పోలీసులే కరువయ్యారు.

దస్తావేజులు పోయాయని వస్తే..

పిఠాపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు కొద్దిరోజుల క్రితం ఒకవ్యక్తి తనఆస్తులకు సంబంధించిన దస్తావేజులు పోయాయని వచ్చారు. మీసేవా కేంద్రం ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినపత్రాలు తీసుకువచ్చి సర్టిఫికెట్ కావాలని అడిగారు. అందుకు ఏకంగా రూ.50వేలుఇవ్వాలని డిమాండ్ చేశారు. చివరకు రూ.20వేలు ఇస్తే కాని అతనికి సర్టిఫికెట్ ఇవ్వలేదు. ఇలాంటి సంఘటనలు పోలీస్‌స్టేషన్లల్లో సర్వసాధారణంగా మారాయి.

సెటిల్మెంట్లు పెరిగాయి

పిఠాపురంలోని పోలీస్‌స్టేషన్లల్లో ప్రైవేటు వ్యక్తులు సెటిల్మెంట్లు చేస్తున్నారని డిప్యూటీ సీఎం పవన్ బహిరంగంగానే చెబుతూ పోలీసుస్టేషన్లను అలా కానివ్వవద్దని, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని, ఫిర్యాదులపై ఉదాసీనంగా వ్యవహరించవద్దని పోలీసులకు సూచించారు. పవన్ బహిరంగంగా చేసిన వ్యాఖ్యలతో పరిస్థితి మారుతుందని ఆశిస్తే సెటిల్మెంట్లు తగ్గకపోగా మరింత పెరిగాయి. పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్లల్లో ప్రైవేటు వ్యక్తులు ఇప్పటికీ సెటిల్మెంట్లు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

కేసుల్లో అనుమానితుడు డ్రైవర్‌గా..

తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌ల్లో పలు కేసుల్లో అనుమానితుడిగా ఉన్న శివ అనే వ్యక్తి పిఠాపురం రూరల్ పోలీస్‌స్టేషన్ జీపుపై రెండునెలలుగా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పోలీసుజీపులో ప్రైవేటు వ్యక్తులు డ్రైవర్‌గా విధులు నిర్వహించకూడదనే నిబంధన ఉంది. గతంలో ఇక్కడ డ్రైవర్‌గా పనిచేసిన హోంగార్డుపై ఆరోపణలతో ఇక్కడినుంచి బదిలీ చేశారు. దీనితో శివ డ్రైవర్‌గా పనిచేయడంతోపాటు పలు ప్రైవేటు వ్యవహారాలు చక్కపెడుతున్నట్లు చెప్తున్నారు. అతడిని ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం.

అదే ఏసీబీకి పట్టించింది..

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చెప్పినా మాకేంటి అనే ధోరణి, ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపం పిఠాపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ, ప్రైవేటు డ్రైవర్ రూ.20వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టించేలా చేసింది. పోలీస్‌స్టేషన్లల్లో ఏం జరుగుతుందోనని ఉన్నతాధికారులు ఆరా తీసినా, నిఘా ఉంచినా, ఫిర్యాదులపై సకాలంలో స్పందించినా ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

ఇది పరిస్థితి

పోలీస్‌స్టేషన్లల్లో ఫిర్యాదులు వచ్చినా వెంటనే స్పందించకపోవడం, కేసులు నమోదుకు రోజుల తరబడి సమయం తీసుకోవడం, గంజాయి బ్యాచ్‌ల ఆగడాలపై ఫిర్యాదులు చేసినా ఫిర్యాదుదారులకే సర్ది చెప్పేందుకు ప్రయత్నించడం వంటి సంఘటనలు తరచూ జరిగాయి. సొమ్ములు వచ్చే కేసులపై తప్ప ఇతర ఫిర్యాదులపై దృష్టి పెట్టడం లేదనే విమర్శ ఉంది. జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ముందుగా అసలు పోలీస్‌స్టేషన్లలో ఏం జరుగుతోందో, ప్రైవేటు వ్యక్తుల జోక్యం ఎందుకు అధికంగా ఉంటోందీ, జిల్లా కేంద్రంలో ఒక ఉన్నతాధికారివద్ద ఎస్సీఎస్టీ కేసులు చూసే సిబ్బంది వ్యవహారశైలి తదితర అంశాలపై దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

నేరస్తులకు అండగా ఉండేవారిని ఉపేక్షించవద్దు: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

ప్రజలను ఇబ్బంది పెట్టే నేరస్థులతోపాటు వారికి అండగా ఉండే నాయకులు, పోలీసులను ఉపేక్షించకూడదని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. పిఠాపురం నియోజకవర్గంలో శాంతిభద్రతల అంశంపై ఆయన గురువారం అధికారులతో సమీక్షించారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న నాలుగు పోలీస్‌స్టేషన్లల్లో పరిస్థితిపై ఇంటెలిజెన్స్ నివేదిక తీసుకోవాలని ఆదేశించారు. అవినీతికి పాల్పడుతున్న అధికారులు కారణంగా పోలీసుశాఖ చులకన అవుతుందని అభిప్రాయపడ్డారు. తన దృష్టికి వచ్చిన అంశాలను వివరించి వెంటనే వాటిని జిల్లా పోలీసు అధికారులకు తెలియజేయాలని తన పేషీ అధికారులను ఆదేశించారు. శాంతిభద్రతల అంశం, ఇతర అంశాలపై రాష్ట్ర డీజీపీ, సంబంధిత విభాగాల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నట్లు పవన్ వెల్లడించారు.


పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు



2027కే పోలవరం

ప్రాజెక్టు సందర్శనలో సీఎం చంద్రబాబు

రాజమహేంద్రవరం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పోలవరం పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. 2027 నాటికి ప్రాజెక్టును పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు పనులను గురువారం సందర్శించి అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. ప్రాజెక్టు నుంచి నీళ్లొదిలే లోపే పునరావాసం పూర్తి చేస్తామన్నారు. ప్రాజెక్టు కోసం త్యాగం చేసి నిర్వాసితులకు న్యాయం చేసే బాధ్యత ప్రభుత్వం మీదన్నారు. పునరావాస కార్యక్రమాలు పూర్తి చేయడానికి అవసరమైన సిబ్బందిని కూడా ఇస్తామని చెప్పారు. 2014 ముందు నిర్వాసితులకు చాలా తక్కువ పరిహారం ఇచ్చారని,2014లో తాము అధికారంలోకి రాగానే 4,311 కోట్లు పరిహారం చెల్లించినట్టు చెప్పారు. మొత్తం రూ.829 కోట్లు నిర్వాసితుల అక్కౌంట్లలో జమ చేశామన్నారు. పరిహారం రూ.10 లక్షలు ఇస్తానని చెప్పిన జగన్ ఒక్క పైసా కూడా ఇవ్వలేదని, వరదల సమయంలో కూడా బాధితులను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2019లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి ఉంటే 2020నాటికే ప్రాజెక్టు పూర్తయ్యేదన్నారు.వైసీపీ నిర్లక్ష్యం వల్ల ఖర్చు బాగా పెరిగిపో యిందన్నారు.రూ.400 కోట్లతో తాము డయా ఫ్రంవాల్ నిర్మిస్తే, వైసీపి నిర్లక్ష్యం వల్ల కొట్టుకుపోయిందని చెప్పారు. ఇవాళ మళ్లీ రూ. 990 కోట్లతో కొత్త డయాఫ్రంవాల్ నిర్మిస్తున్నామన్నారు. కొందరి పేర్లు తొలగించారని బాధితులు చెబుతున్నారని, విచారణ జరిపించి, అర్హులందరికీ న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. పునరావాసంతో పాటు మీ ఆదాయమార్గాలు, జీవన ప్రమాణాలు పెరిగే చర్యలు తీసుకుంటామన్నారు.ఇళ్లు నిర్మించుకునే గిరిజనులకు రూ.75వేలు అదనంగా అందిస్తామన్నారు. అంతకు ముందు డయాఫ్రంవాల్ పనులను పరిశీలించారు. పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన సీఎం చంద్రబాబునాయుడుకు ముందు ఘన స్వాగతం లభించింది. ప్రజాప్రతినిధులు, అధికారులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. సీఎం కూడా అందరినీ పలకరిస్తూ ముందుకు వెళ్లారు. పోలవరం నిర్వాసితులు, ఇతరులు సీఎంకు వినతి పత్రాలు ఇచ్చారు.అనేకమంది జై బాబు జైజై బాబు అంటూ నినాదాలు చేశారు. ఆయన వెంట మంత్రులు నిమ్మల రామానాయుడు, కె.పార్థసారథి,ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ,బత్తుల బలరామకృష్ణ,జ్యోతుల నెహ్రూ, రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి ఉన్నారు.

కాకినాడ రూరల్ ఎంపీపీ జనసేన కైవసం

» ఏకగ్రీవంగా ఎన్నికైన నందిపాటి అనంతలక్ష్మి
» బాయ్‌కాట్ చేసిన వైసీపీ ఎంపీటీసీలు


ఎంపీపీగా ఎన్నికైన అనంతలక్ష్మిని అభినందిస్తున్న ఎన్నికల అధికారిణి అడపా వెంకటలక్ష్మి, ఎమ్మెల్యే పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కాకినాడరూరల్ ఎంపీపీ పదవి జనసేన కైవసం చేసుకుంది. ఎంపీపీగా పండూరు-1 ఎంపీటీసీ సభ్యురాలు నందిపాటి అనంతలక్ష్మిని సభ్యులు ఏకగ్రీవంగాఎన్నుకున్నారు. గురువారం రమణయ్యపేట మండలకార్యాలయంలోని సమావేశ మందిరంలో జేసీ, ఎన్నిక అబ్జర్వర్ రాహుల్ మీనా పర్యవేక్షణలో ఎన్నికల అధికారిణి, డ్వామా పీడీ అడపావెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ఎంపీపీ ఎన్నికకోసం నామినేషన్ స్వీకరించారు. మండలంలో 18 ఎంపీటీసీసభ్యులు ఉండగా 10మంది హాజరయ్యారు.ఈ సందర్భంగా జనసేననుంచి నందిపాటి అనంతలక్ష్మి ఒక్కరే నామినేషన్ దాఖలుచేశారు. ఎంపీపీ అభ్యర్థిగా అనంతలక్ష్మిని పండూరు-2 ఎంపీటీసీ నందిపాటి వెంకటశ్రీనివాస్ ప్రతిపాదించగా నేమాం ఎంపీటీసీ గుత్తుల సత్తిబాబు బలపరిచారు. మిగతాసభ్యులు ఏకగ్రీవంగాఆమోదించారు. వైసీపీనుంచి ఎవరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో సభ్యులు చప్పట్లతో మద్దతు తెలిపారు. ఎంపీపీగా నందిపాటి అనంతలక్ష్మిని ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిణి అడపా వెంకటలక్ష్మి ప్రకటించి ఆమెతో ప్రమాణస్వీకారం చేయించారు. ఎంపీపీ అనంతలక్ష్మిని రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎన్నికల అధికారిణి అడపా వెంకటలక్ష్మి అభినందించారు.

ఉచిత గ్యాస్ సిలిండర్.. బుక్ చేసుకున్నారా?



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దీపం-2 ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకంలో తొలి గ్యాస్ సిలిండర్ పొందడానికి కేవలం నాలుగురోజుల గడువు మాత్రమే ఉంది. ఈనెల 31వతేదీ దాటితే తొలి గ్యాస్ సిలిండర్ ఉచితంగా పొందే అవకాశంలేదు. ఈ నేపథ్యంలో త్వరగా తొలి గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

» జిల్లాలో అర్హులు 5,11,756 మంది
» ఇప్పటివరకు బుక్ చేసుకున్నవారు 4,55,773మంది
» ఇంకా బుక్ చేసుకోవాల్సిన వారు 55,983మంది లబ్ధిదారులు
» 31 దాటితే తొలి ఉచితం పొందలేరు

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గతేడాది నవంబరు నెలలో దీపం-1 పథకంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ప్రారంభించారు. తెలుపురేషన్‌కార్డు కల్గిఉండి ఎల్‌పీజీ కనెక్షన్ ఉన్న వారందరికీ ఈ పథకంలో చోటు కల్పించారు. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా 5,11,756మందిని ఈ పథకంలో అర్హులుగా అధికార యంత్రాంగం గుర్తించింది. దీపం పథకంలో ఉచితంగా సిలిండర్లను పొందాలని కోరింది. ఈ నేపథ్యంలో ఇప్పటికి 4,55,773 మంది లబ్ధిదారులు ఉచితంగా గ్యాస్ పథకానికి బుక్ చేసుకున్నారు. ఇంకా 55,983మంది వివిధ కారణాలవల్ల తొలి గ్యాస్ సిలిండర్‌ను బుక్ చేసుకో లేకపోయారు. కొంతమంది స్థానికంగా లేకపోవడం, మరికొంతమంది లబ్ధిదారులు పలు పనుల నిమిత్తం వలస వెళ్లిపోవడం వంటి కారణాల వల్ల బుక్ చేసుకోలేదు. ఈనెల 31వతేదీలోపు బుక్ చేసుకోకపోతే తొలిగ్యాస్ సిలిండర్ ఉచితంగా పొందలేరని అధికారులు ప్రకటించారు. దీంతో లబ్ధిదారులు కొంత వరకు అప్రమత్తమయ్యారు.

ఐదునెలల్లో రూ.35కోట్ల36లక్షలు జమ

ఐదునెలలకాలంలో జిల్లాలో 4,55,773మంది గృహ వినియోగ వంటగ్యాస్ వినియోగదారులు తొలి గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకున్నారు. దీనిలో ఇప్పటివరకు 4,49,651మంది లబ్ధిదారుల ఖాతాలకు రాయితీసొమ్ము రూ.35కోట్ల36లక్షలు జమైంది. ఇంకా 6122మందికి లబ్ధిదారులకు రూ.50లక్షల32వేలు జమకావాల్సిఉంది. మరో నాలుగురోజుల్లో ఈ సొమ్ము జమవుతుందని చెప్తున్నారు.

వీరు అర్హులు


తెలుపురేషన్‌కార్డు కలిగినవారు అర్హులు.గ్యాస్ కనెక్షన్‌కు ఆధార్ అనుసంధానం చేసి ఉండాలి. ఈకేవైసీ పూర్తిఅయి ఉండాలి. ఒక రేషన్‌కార్డులో సభ్యుల పేర్లతో రెండుగానీ, మూడుగానీ కనెక్షన్లున్నా ఒక్క కనెక్షన్‌కే రాయితీ వస్తుంది. సిలిండర్ బుక్ చేసుకున్న 48 గంటల్లో జమ అవుతుంది.

31వతేదీ వరకు మాత్రమే

మిగిలిన అర్హులు ఈనెల 31వతేదీలోపు తొలి సిలిండర్ బుక్ చేసుకోవాలి. లేదంటే తర్వాత తొలి సిలిండర్ ఉచితంగా పొందలేరు. ఏప్రిల్ 1 నుంచి రెండో సిలిండర్ బుకింగ్ చేసుకునే ప్రక్రియ ప్రారంభమవుతుంది. లబ్ధిదారులు రెండో సిలిండర్ బుకింగ్ చేసుకోవడానికి సిద్ధం కావచ్చు.
-సత్యనారాయణరాజు, పౌరసరఫరాలశాఖ అధికారి

ఆధార్ సమస్య ఏదైనా.. ఇక్కడే పరిష్కారం





కాకినాడలోని ఆధార్ సెంటర్

- అప్పట్లో హైదరాబాద్.. ఇప్పుడు రాష్ట్రంలో మూడుచోట్ల సెంటర్లు
- విజయవాడ, విశాఖపట్నంతోపాటు కాకినాడలో ఏర్పాటు
- స్థానిక సెంటర్లలో మార్పులు జరగని వాటికి ఇక్కడ పరిష్కారం
- రోజుకు 500మందికి అప్లోడ్ చేయగల సామర్థ్యం
- ఆదివారం కూడా పనిదినమే

ఆంధ్రజ్యోతి/కార్పొరేషన్(కాకినాడ)

ప్రభుత్వ పథకం కావాలన్నా.. బ్యాంక్ అకౌంట్ కావాలన్నా.. లోన్ కావాలన్నా.. ఆధార్.. ఆధార్.. ఆధార్.. ఇలా ఏ పని జరగాలన్నా.. ఆధార్ కార్డే ఆధారం. ఇది ఎన్నో విధాలుగా ఉపయోగపడుతుంది. ఇలాంటి ఆధార్ కార్డులో ఎలాంటి తప్పు లేకుండా చూసుకోవాలి. ఆధార్‌లో స్వల్ప మార్పులకు స్థానిక ఆధార్‌సెంటర్లలో చేసుకునే అవకాశం ఉంది. కానీ, పెద్దస్థాయిలో తప్పులు ఉంటే మార్పు చేసుకోవడానికి ఒకప్పుడు హైదరాబాద్ వెళ్లాల్సి వచ్చేది. కానీ, ఇప్పుడు కాకినాడలో అందుబాటులోకి వచ్చింది. మన రాష్ట్రంలో ఉన్న మూడు ఆధార్ సెంటర్లలో ఇక్కడే ఒకటి ఉండడం విశేషం.

యుఐడీఏఐ ద్వారా అప్‌డేట్

ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి మారాలన్నా, చిరునామా మార్చుకోవాలన్నా ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి. ఆధార్‌కార్డులో మీ సమాచారం ఎప్పటికప్పు డు అప్‌డేట్ చేసుకోవాలని కేంద్ర విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యుఐడీఏఐ) ప్రోత్సాహం కల్పిస్తూనే ఉంది. ఆధార్‌కార్డులు సాధారణంగా చాలామంది అప్‌డేట్ చేసుకోవాల్సి వస్తుంది. పేరు తప్పు ఉండడమో, చిరునామా తప్పుగా ఉండడం లేదా అప్‌డేట్ చేసుకోవాల్సి రావడం.. పుట్టిన తేదీ మార్పు చేయాల్సి ఉండడం, ఫొటో, ఫోన్ నెంబరు అప్‌డేట్ చేయించుకుంటారు. ఆధార్‌కార్డు తప్పనిసరి అయిపోయింది. గుర్తింపు కార్డు దగ్గర నుంచి బ్యాంక్ అకౌంట్ కావాలన్నా,పాన్‌కార్డు కోసమైనా ఇంకా ప్రభుత్వ పథకాల ప్రయోజనాల కోసమైనా ఆధార్‌కార్డు ఉండాలి. అందులో సరైన వివరాలు ఉండాలి. మరీ ముఖ్యంగా ఆధార్‌కార్డు తీసుకుని పదేళ్లు గడిస్తే తప్పకుండా అప్‌డేట్ చేసుకోవడానికి బయోమెట్రిక్ వంటి వివరాలు అప్‌డేట్ చేసుకోవడం మంచిది. ఆధార్ డాక్యుమెంట్లు అన్నీ అప్‌టు డేట్ ఉండాలి. ఆధార్ సెంటర్‌లో అప్‌డేట్ చేసుకోవాల్సి వస్తే మాత్రం ఇక్కడ అప్లికేషన్ చార్జి పేరిట రూ.50పైకిగా వసూలు చేస్తారు.

ఆధార్ సేవల చార్జీలు.. ఇలా..

ఆధార్ నమోదు, తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్, డెమోగ్రాఫిక్ అప్‌డేట్ వయస్సు ఐదు నుంచి ఏడు, 15 నుంచి 17 వయస్సు వారికి పూర్తిగా ఉచితం. ఆధార్ డౌన్‌లోడ్ అండ్ ప్రింట్ రూ.30 మాత్రమే. డెమోగ్రాఫిక్ అప్‌డేట్, డాక్యుమెంట్ అప్లోడ్‌కి రూ.50 మాత్రమే. బయోమెట్రిక్ అప్‌డేట్, డెమోగ్రాఫిక్ అప్‌డేట్‌తో లేక కేవలం బయోమెట్రిక్ అప్‌డేట్‌కి రూ.100 మాత్రమే. ఇంటివద్ద ఆధార్ ఎనరోల్‌మెంట్, అప్‌డేట్ కోసం రూ.700 అదనంగా ప్రతీ వ్యక్తికి రూ.350 చార్జి చేస్తారు.

ఆదివారం కూడా పనివేళలే..

ప్రతిరోజూ ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పనిచేయడంతోపాటు ఆదివారం కూడా పని వేళలే. ఇక్కడ మేనేజర్‌తోపాటు 20మంది సిబ్బంది పనిచేస్తారు.

ఇప్పుడు కాకినాడలోనే..

జిల్లాలో ఆధార్ అప్‌డేట్స్ కోసం ఏర్పాటు చేసిన సెంటర్లలో పరిష్కారం కాని సమస్యలు తలెత్తితే హైదరాబాద్ వెళ్లక తప్పేది కాదు. అక్కడ మాత్రమే సమస్య పరిష్కరించేవారు. కానీ ఇప్పుడు మన కాకినాడలోను ఆ సెంటర్ ను పెట్టారు. యూఐడీఏఐ ఆధ్వర్యంలో దేశం మొత్తం మీద 80 ఆధార్ సెంటర్లు ఉంటే మన రాష్ట్రంలో విజయవాడ, విశాఖపట్నం తర్వాత మ న కాకినాడలోనే బాలత్రిపురసుందరి దేవాలయం ఎదురుగా ఏర్పాటు చేశారు. దీంతో ఆధార్ అప్‌డేట్స్‌లో ఎలాంటి సమస్య వచ్చినా హైదరాబాద్ వెళ్లాల్సిన పని లేకుండా ఇక్క డే పరిష్కరిస్తున్నారు. రోజుకు 500 ఆధార్ అప్‌డేట్స్ చేయగల కెపాసిటీ ఈ సెంటర్‌కి ఉంది. రోజుకి 400 నుంచి 500మంది ఆధార్ అప్‌డేట్స్ కోసం వస్తుంటారు. ఈ ఆధార్ సెంటర్‌లో అధికసంఖ్యలో కౌంటర్లు ఉండడంతోపాటు శిక్షణ పొందిన సిబ్బంది ఉండడంతో సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తారు. 18ఏళ్లు దాటిన వారికి కొత్త ఆధార్ కావాలన్నా, ఎన్ఆర్ఐలకు కొత్త ఆధార్ కార్డు కావాలన్నా, ఫారిన్ సిటిజన్లకు ఆధార్ కోసం ఇక్కడ మాత్రమే ఆధార్ అవుతుంది. వృద్ధులు, దివ్యాంగులకు వీల్‌చైర్ సౌకర్యంతోపాటు లిఫ్ట్ సౌకర్యం కూడా ఉంది. ఈ సెంటర్‌కి తగిన ప్రాచుర్యం లేకపోవడంతో ఇంకా ఆధార్ సమస్యల కోసం జిల్లావాసులు రకరకాల ఆధార్ సెంటర్లు చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

ఇక్కడే పరిష్కరిస్తున్నాం..

ఈ ఆధార్ సెంటర్ కోసం చాలా మందికి తెలియక ఆధార్ అప్‌డేట్స్‌లోని సమస్యల కోసం ఎక్కడెక్కడికో తిరుగుతున్నారు. హైదరాబాద్ కూడా వెళ్లాల్సిన పని లేకుండా అన్ని సమస్యలు ఇక్కడే పరిష్కరిస్తాం. ప్రతిఒక్కరూ మీ ఆధార్ సెంటర్‌ని సద్వినియోగం చేసుకోవాలి.

-కె.శ్రీనివాస్ వర్మ, ఆధార్ సెంటర్ మేనేజర్, కాకినాడ



ఆంధ్రజ్యోతి కార్ అండ్ బైక్ రేస్ డ్రాలో లక్కీ కూపన్లను కలుపుతున్న దృశ్యం

అక్షర..లక్షలు!

ఆంధ్రజ్యోతి పాఠకాభిమానం.. యూనిట్ ఆఫీస్‌లో ఉమ్మడి జిల్లా లక్కీడ్రా

మూడు ప్రధాన బహుమతులతోపాటు 103 మందికి గిఫ్టుల నజరానా







ఆంధ్రజ్యోతి పాఠకుల కోసం నిర్వహించిన లక్కీడ్రాలో విజేతలను ప్రకటిస్తున్న ఆంధ్రజ్యోతి బీఎం, ఎడిటోరియల్, యాడ్స్, సర్క్యులేషన్ ఉద్యోగులు, ఏజెంట్లు

తెలుగు భాష పరిరక్షణలో ఆంధ్రజ్యోతి కృషి అభినందనీయం

తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్

దివాన్‌చెరువు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష అభివృద్ధికి ఆంధ్రజ్యోతి చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువులోని యూనిట్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఆంధ్రజ్యోతి లక్కీడ్రాకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 'నా ఐపీఎస్ ప్రిపరేషన్‌లో కూడా ఆంధ్రజ్యోతి పత్రిక చదవడం ఎంతో ఉపకరించిందన్నారు. పాఠకులకు లక్కీడ్రా నిర్వహించడం అభినందనీయమన్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తూ వారధిగా నిలుస్తున్న ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు. బ్రాంచ్ మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఆంధ్రజ్యోతి లక్కీడ్రా నిరంతరాయంగా కొనసాగుతోందన్నారు. ఎడిషన్ ఇన్‌చార్జి బీహెచ్‌వీ మంగేష్ మాట్లాడుతూ పాఠకులకు, పత్రికకు ఉన్నఅనుబంధాన్ని గుర్తుచేస్తూ లక్కీడ్రా ఉద్దేశాన్ని వివరించారు. అనంతరం లక్కీడ్రా ద్వారా విజేతలను ఎంపిక చేశారు. ఎస్పీ నరసింహకిషోర్, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, బీఎం శ్రీనివాసరావు విజేతలను ప్రకటించారు. ఈ లక్కీడ్రాలో మొదటి బహుమతిగా మోటార్ సైకిల్, రెండో బహుమతిగా ఫ్రిజ్, మూడో బహుమతిగా టీవీ, ఇవి కాకుండా రూ.2 వేలు విలువ చేసే వంద గృహోపకరణ బహుమతుల విజేతలను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజర్ బి.గోపాలకృష్ణ, యాడ్స్ మేనేజర్ పీవీ కృష్ణారావు, ఆంధ్రజ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఎస్ఎస్ఎన్ సత్యనారాయణ, ఏబీఎన్ స్టాఫ్ రిపోర్టర్ రాజబాబు, స్టాఫ్ రిపోర్టర్ పి.రమేష్ నాగేంద్ర, ఆంధ్రజ్యోతి ఉద్యోగులు, పాఠకులు పాల్గొన్నారు.

100 కన్సొలేషన్ బహుమతుల విజేతలు వీరే..

1. ఏడిద భరతుడు, రాజమండ్రి
2. టి.సత్యవతి, రాజవొమ్మంగి
3. ఈతకోట నాగరాజు, మండపేట
4. బేహర వెంకటసుబ్బారావు, హుకుంపేట
5. ఆర్.ఎమ్.వి వెంకటరమణ, చీడిగ
6. గ్రంధి సత్యశ్రీ, రాజోలు
7. భాగ్య ఫ్యాబ్రిక్స్, కాకినాడ
8. ఎండీ ఖైరున్నసాబేగం, ఐ.పోలవరం
9. బి.సత్యవతి, రాజమండ్రి
10. కముజ సుబ్రహ్మణ్యం, చినకొత్తలంక
11. చెరుకూరి సాయిలక్ష్మిసూర్యకుమారి, గొల్లవిల్లి
12. జె.గణేష్, పెద్దాపురం
13. చుండ్రు వీవీ సత్యనారాయణ, రంగంపేట
14. సుంకర వెంకటరామమోహన్‌రావు, గేదెల్లంక
15 గేదెల శ్రీనివాస్, కపిలేశ్వరపురం
16. భూమా రామారావు, దూబచర్ల
17. వాసురెడ్డి కోటేశ్వరరావు, బొమ్మూరు
18. కల్వకోలను త్రినాధస్వామి, పెదగాడవల్లి
19. కల్లూరి సత్యప్రసాద్, కాకినాడ
20. జల మదన్‌మోహన్, రాజమండ్రి
21. తోట సత్యమూర్తి, కాకినాడ
22. గుబ్బల కీర్తిశ్రీ, రాజోలు
23. మానేపల్లి అబ్బాయిగిరి, కామనగరువు
24. కొత్రకోటి రిషిశ్రీచరణ్, అమలాపురం
25. వల్లూరి పీటర్, సామర్లకోట
26. డెక్క మానస, పెద్దాపురం
27. ఎం.కిషోర్, గోవిందపురం
28. ఎస్.సత్యనారాయణరెడ్డి, అనపర్తి
29. టి.లక్ష్మణరావు, కాకినాడ
30. కింతాడి జగన్నాథం, వాడపాలెం
31. నామాల అరుణకుమారి, రాజమండ్రి
32. జీడిగుంట సూర్యకుమారి, పెద్దాపురం
33. విజ్జిర లక్ష్మీరత్నకుమారి, గోకవరం
34. గుణ్ణం శ్రీహరిరావు, రామచంద్రరావు
35. కె.సతీష్‌కుమార్, మండపేట
36. బొక్కా వెంకటేశ్వరరావు, సామర్లకోట
37. జట్ల నాగేశ్వరరావు, రావులపాలెం
38. కె.వి.రాఘవరావు, రాజమండ్రి
39. ఎ.ఎస్.ఎస్.మూర్తి, లూటుకుర్రు
40. లొల్ల విశ్వమోహన్‌రావు, రాజమండ్రి
41. నడిపల్లి సంధ్యరాణి, కోటపాడు
42. ముక్కవిల్లి కృష్ణ ప్రసాద్, కొవ్వూరు
43. కొయలమూడి సత్యదేవరాయ, నిడదవోలు
44. జి.వి.ఎస్.శర్మ, భట్నవిల్లి
45. జాలిం రాముడు, జార్జిపేట
46. తేలుకుంట జగన్నాధరావు, పోతవరం
47. లింగాల శ్రీరామచంద్రమూర్తి, కాకినాడ
48. కాకర్ల లక్ష్మీనారాయణ, వేట్లపాలెం
49. కె.నాగేశ్వరరావు, కాకినాడ
50. మద్దిపాటి సత్యనారాయణ, రంగంపేట
51. పెనుమళ్ల సత్యవతి, కొత్తపేట
52. కముజు వెంకటస్వామి, కాట్రేనికోన
53. గంధవరపు శ్రీనివాసరావు, వాకలపూడి
54. జి.ఎస్.వి. సుబ్రహ్మణ్యం, రాజోలు
55. నందిక కనకరెడ్డి, కాకినాడ
56. పోతాబత్తుల శ్రీనివాసరావు, రాజమండ్రి
57. జి.మణికంఠ, రాజమండ్రి
58. కారింపూడి కృష్ణమోహన్‌రావు, ధవళేశ్వరం
59. కడి సూర్యప్రకాశ్‌రావు, విలసవిల్లి
60. గార్లపాటి గోపాలకృష్ణమూర్తి, ర్యాలి
61. కుర్రా శ్రీనివాసరావు, ఎం.చామవరం
62. దాట్ల దేవదానంరాజు, యానాం
63. తాడి రామకృష్ణ(బుజ్జి), మలికిపురం
64. కారుమూరి చిరంజీవి, యండగండి
65. టి.వేదంత వీరసాయి, పాలచర్ల
66. గెల్లి సూర్యనారాయణమూర్తి, రాజోలు
67. వంతల చిన్నారావు, అడ్డతీగల
68. పప్పుల మోక్షిత శ్రీనంద, బిక్కవోలు
69. ఆలపాటి రాజయోగం, రాజాంపాలెం
70. పుల్లి మధులత, నల్లజర్ల
71. తోరాటి చిరంజీవి చలపతిరావు, సంధిపూడి
72. కూచిమంచి నాగేంద్రప్రసాద్, అమలాపురం
73. కాద శ్రీరామకృష్ణ, తాటిపర్తి
74. పి.త్రినాథులు, అమలాపురం
75. పలుకూరి శ్రీరామ్, ధర్మవరం
76. జుత్తుక సాయి మౌనిక, ఇంద్రపాలెం
77. దాపర్తి రాంబాబు, చాగల్లు
78. ఆకోజు సురేష్‌బాబు, చింతూరు
79. బలుసు సత్యనారాయణమూర్తి, కాకినాడ
80. ఆరుమిల్లి రామన్న, శివకోటి
81. బండి లక్ష్మి, కొండెవరం
82. ఏడిద సత్యనారాయణ, పిఠాపురం
83. ఏలూరి సాయి జగన్నాథశ్రీ, యానాం
84. బుద్ధరాజు సుబ్బరాజు, జగ్గంపేట
85. కరుటూరి సత్యనారాయణ, తాళ్లపాలెం
86. జి.ఆర్.ముత్తవల్లి, రాజమండ్రి
87. గుద్దాటి శ్రీహర్ష, ముమ్మిడివరం
88. గడా చిట్టి సూర్యం, చిన్నాయిగూడెం
89. గుత్తుల విజయలక్ష్మి, వేమగిరి
90. చెక్కా పాన్విత్, చొప్పెళ్ల
91. చప్పిడి స్వామి బాలరాజు, వేట్లపాలెం
92. కటికదల గంగరాజు, సోమేశ్వరం
93. పినపోతుల వెంకటనాగదేవి, అచ్యుతపురం
94. కె.సాహితీరమ్య, పెద్దాపురం
95. మోటేపల్లి శివరామమూర్తి, గోనాడ
96. కె.మహేష్‌బాబు, తాళ్లరేవు
97. పొట్లకాయల బంగారం, పిఠాపురం
98. దేవవరపు సాయిబాబు, చింతూరు
99. పెద్దింటి కళ్యాణి, ఓడలరేవు
100. యగ్నేష్ వడ్డి, తాటిపాక

వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం రూ.1.23 కోట్లు



శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీల్లో వచ్చిన కానుకులను లెక్కిస్తున్న దృశ్యం

10 గ్రాముల బంగారం, 1.925 గ్రాముల వెండి లభ్యం

ఆత్రేయపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలోని హుండీలను దేవదాయ శాఖ పర్యవేక్షణాధికారులు టీవీఎస్ఆర్ ప్రసాద్, బి.కిరణ్, బి.నరేంద్ర కుమార్ పర్యవేక్షణలో గురువారం తెరిచి లెక్కించారు. 31 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.96,99,132, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.23,27,304... మొత్తం రూ.1,23,25,672 ఆదాయం లభించినట్టు ఆలయ ఉప కమిషనరు, కార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. బంగారం 10 గ్రాములు, వెండి 1.925 గ్రాములు, పలు దేశాల విదేశీ కరెన్సీ నోట్లు 20 లభించాయి. క్షేత్ర పాలకుడు విశ్వేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2,99,236 లభించింది. లెక్కింపులో గ్రామస్తులు, బ్యాంకు సిబ్బంది, శ్రీవారి సేవకులు, సిబ్బంది పాల్గొన్నారు.

డెల్టా కాలువలకు 10,700 క్యూసెక్కుల

నీరు విడుదల

ధవళేశ్వరం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కాటన్ బ్యారేజ్ నుంచి డెల్టా కాలువకు 10,700 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. 83 డ్యూటీలో తూర్పు డెల్టాకు 3,200 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 86 డ్యూటీలో 2వేల క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 84 డ్యూటీలో 5,500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. గురువారం గోదావరిలో నీటి లభ్యత 10,468 క్యూసెక్కులు ఉండగా ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 9.50 అడుగులు నమోదైంది.

దేశ ప్రయోజనాలు, విదేశీ సందర్శకుల రక్షణకు నూతన ఇమిగ్రేషన్ బిల్లు దోహదం

కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్



కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రయోజనాలను కాపాడడంతో పాటు విదేశీ సందర్శకుల రక్షణకు నూతన ఇమిగ్రేషన్ బిల్లు-2025 దోహదం చేస్తుందని కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఇమిగ్రేషన్, ఫారినర్స్ బిల్లు-2025పై జరిగిన లోక్‌సభలో గురువారం చర్చలో ఆయన మాట్లారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో నేడు దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడంతో పాటు సాంస్కృతిక, ఆధ్యాత్మిక, ఆర్థిక అవసరాలకు నిలయంగా మారిందన్నారు. నూతన చట్టం ద్వారా దేశ భద్రత, నియంత్రణకు ప్రాధాన్యత ఇస్తూనే చట్టబద్ధమైన సందర్శకులకు భారంగా మారకూడదన్నారు. 2011 నుంచి భారత్‌కు వచ్చే విదేశీ విద్యార్థుల సంఖ్య దాదాపు 340 శాతం పెరిగిందన్నారు. క్లాజ్-9 ద్వారా మన దేశంలోని విద్యా సంస్థల్లో చేరే విదేశీ విద్యార్థుల సమాచారాన్ని తప్పనిసరిగా కేంద్రానికి అందించాల్సిన అవసరం ఉంటుందన్నారు. చట్టంలో ముఖ్యమైన క్లాజ్-5 ద్వారా దేశవ్యాప్తంగా జిల్లా ప్రధాన కార్యాలయాల్లో 108 ఇమిగ్రేషన్ చెక్‌పోస్టులు, 700 పైగా విదేశీయులు రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఏర్పాటు కానున్నాయన్నారు.

భక్తుల కొంగు బంగారం కాండ్రకోట నూకాలమ్మ

నేటి నుంచి 45 రోజులు జాతర మహోత్సవాలు... భక్తులకు ఏర్పాట్లలో నిమగ్నమైన ఆలయ సిబ్బంది, పోలీసు అధికారులు



పెద్దాపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కోర్కెలు తీర్చే కల్పవల్లి, భక్తుల కొంగు బంగారం కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ, పోలీసు అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ నెల 28 నుంచి ఏప్రిల్ 11 వరకు సుమారు 45 రోజుల పాటు జాతర మహోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వాహణాధికారి సౌజన్య తెలిపారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు, ఎస్‌డీపీవో శ్రీహరిరాజు పర్యవేక్షణలో ఎస్ఐ వి.మౌనిక, పోలీసు సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు. అధిక సంఖ్యలో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. పలు స్వచ్ఛంద సంస్థల సహాయ సహకారాలతో చంటి పిల్లలకు పాలు, మజ్జిగ, మంచి నీరు సరఫరా చేయనున్నారు. యాత్రికుల కోసం ప్రత్యేక రవాణా సదుపాయాలు కల్పించారు. ముఖ్య అతిథిగా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పతో పాటు పలువురు పలువురు ప్రముఖులు హాజరవుతారని ఈవో తెలిపారు. ప్రత్యేక ఆకర్షణగా పలు సాంస్కృతిక ప్రదర్శనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు జాతర రోజున మ్యూజికల్ బ్యాండ్, కళ్లు మిరుమిట్లు గొలిపే బాణసంచా ఏర్పాటు చేశారు. అమ్మవారికి అమావాస్య నాడు జాతర, మహా నైవేద్యం చెల్లింపు, బద్ది కడుగు ఉత్సవం నిర్వహిస్తారు. ఉగాది పర్వదినం రోజున సంప్రదాయం ప్రకారం అమ్మవారి దర్శనానికి అనుమతించమని ఈవో చెప్పారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు కోరారు.

పారిశుధ్య నిర్వహణపై సీఎంవో నుంచి ఫోన్

హెల్త్ సిబ్బందిపై మండిపడ్డ కాకినాడ కమిషనరు భావన

గత రెండు రోజులుగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో ఏడీసీ, హెల్త్ ఆఫీసర్ సమావేశాలు

క్రమశిక్షణ చర్యలు తప్పవంటున్న అధికారులు

తమ సెక్షన్ నుంచి రూపాయి ఇచ్చేది లేదంటూ బ్లాక్‌మెయిల్ చేస్తున్న ఇన్‌స్పెక్టర్లు

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీల్లో పారిశుధ్య నిర్వహణపై నగరపాలక సంస్థలు, మున్సిపాల్టీలు, నగర పంచాయతీల్లోని ప్రజలకు అమరావతి నుంచి ఇంటిగ్రేటెడ్ వాయిస్ రికార్డింగ్ సిస్టమ్ (ఐవీఆర్ఎస్) ద్వారా వచ్చిన కాల్స్‌కి వారిస్తున్న సమాధానం ద్వారా పారిశుధ్యానికి పర్సంటేజ్ ఇస్తారు. కాకినాడలో పారిశుధ్యం పర్సంటేజ్ తగ్గడంతో ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నుంచి కాకినాడ కార్పొరేషన్ అధికారులకు ఫోన్ వచ్చింది. పరిస్థితి మెరుగుపరుచుకోవాలని సూచించారు. దీంతో కమిషనరు భావన హెల్త్ సెక్షన్ సిబ్బందిపై మండిపడ్డారు. ఆ బాధ్యతలను అదనపు కమిషనరు సుధాకర్‌కి అప్పగించారు. ఏడీసీ, హెల్త్ ఆఫీసర్ పృధ్వీచరణ్ గత రెండు రోజులుగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమావేశాలు నిర్వహిస్తూ పారిశుధ్యం మెరుగుపడకపోతే క్రమశిక్షణ చర్యలు తప్పవంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్య నిర్వహణపై స్థానికంగా కూడా పలు విమర్శలు వస్తుండడంతో ఇదే అదనుగా సీఎంవో నుంచి ఫోన్‌కాల్ రావడంతో అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. సర్వీస్ రూల్స్ లేని కారణంగా ఎటువంటి ట్రాన్స్‌ఫర్లు లేకపోవడంతో పాతుకుపోయిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అధికారులకే అల్టిమేటం జారీ చేశారు. కార్పొరేషన్ పరిధిలో జరిగే ఏ కార్యక్రమాలకైనా, మరి ఏ ఇతర అవసరాలకైనా సెక్షన్ నుంచి రూపాయి ఇచ్చేది లేదంటూ అధికారులను ఇన్‌స్పెక్టర్లు బ్లాక్‌మెయిల్ చేస్తున్నట్టు సమాచారం. దీనిపై ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి.

ఆర్‌అండ్‌బీ ఇంజనీర్లపై విచారణకు ఆదేశం

పిఠాపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించని ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారులపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు గురువారం రాత్రి ఆర్‌అండ్‌బీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే జీవో నెం.141 జారీ చేశారు. పిఠాపురం-ధర్మవరం మధ్య ఆర్‌అండ్‌బీ రహదారి విస్తరణ, పునర్నిర్మాణ పనులపై 2021లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించి పలు లోపాలను గుర్తించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని వెల్లడైంది. విజిలెన్స్ అధికారుల నివేదిక ఆధారంగా అప్పటి ఆర్‌అండ్‌బీ ఈఈ పి.మురళీకృష్ణ, డీఈఈ కేఎస్ రాఘవరావు, ఏఈఈ పి.అశ్రితలపై అభియోగాలు నమోదు చేశారు. దీనిపై విచారణకు విజయవాడ ఆర్‌అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ జీవీ భాస్కరరావును విచారణాధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రెండు నెలల్లోగా విచారణ పూర్తి చేసిన నివేదిక అందజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



దొమ్మేరులో వ్యక్తి దారుణ హత్య

» కుడిచేతి వేళ్ళ గుత్తి మాయం » ఏడుచోట్ల కత్తితో నరికేసిన వైనం
» పోలీసులకు చిక్కని ఆయుధం » సీసీ పుటేజీ..సెల్‌ఫోన్ ఆధారంగా దర్యాప్తు

కొవ్వూరు మండలం దొమ్మేరులో అతి కిరాతకంగా జరిగిన హత్య సంచలనంగా మారింది. దొమ్మేరు గ్రామానికి చెందిన పెండ్యాల ప్రభాకరరావు(47) గత కొంతకాలంగా కొవ్వూరు పట్టణంలో నివాసం ఉంటున్నాడు.గతంలో పెరల్స్ ఏజెంట్‌గా పని చేసేవాడు..అది మూసేయడంతో గత ఆరేళ్లగా వేస్టేజ్ ఆయుర్వేద ప్రాడక్ట్స్ ఏజెంటుగా పని చేస్తున్నాడు. ఇంటి వద్దే స్టాక్ పాయింట్ నిర్వహిస్తున్నాడు. ఈ నెల 26వ తేదీ రాత్రి సుమారు 8 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన మృతుడు దొమ్మేరు శివారు డ్రాగన్ ఫ్రూట్ తోటల్లో అత్యంత దారుణంగా హత్యకు గురయ్యాడు. తల వెనుక, మెడపై, కుడి చేతిపై కత్తితో సుమారు 7 చోట్ల నరికి హత్య చేశారు. కుడిచేతి మణికట్టు వద్ద కత్తితో నరికివేసి చేతివేళ్ల గుత్తిని మాయం చేశారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్



మృతుడు పెండ్యాల ప్రభాకరరావు(ఫైల్)

కొవ్వూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరిజిల్లా కొవ్వూరు మండలంలోని దొమ్మేరు సంతమార్కెట్ నుంచి నందమూరు వెళ్లే రోడ్‌లో ఎన్‌హెచ్ బైపాస్ అండర్‌పాస్ సమీపంలోని నీరుకొండ శేషగిరిరావుకు చెందిన డ్రాగన్ ఫ్రూట్స్‌తోటలో ప్రభాకరరావు మృతదేహాన్ని గురువారం ఉదయం గుర్తించిన రైతు పోలీసులకు సమాచారం అందించారు. కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్, పట్టణసీఐ పి.విశ్వం, ఎస్ఐ కె.జగన్మోహనరావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్‌లను రప్పించి ఆధారాలను సేకరించారు. డాగ్‌లు పరిసర పంటల పొలాల్లో తిరుగుతూ స్పీడ్ హైవే అండర్‌పాస్ వరకు వెళ్లి వెనక్కి వచ్చేశాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించా రు. సీసీ కెమెరా ఫుటేజీ, సెల్‌ఫోన్ కాల్స్ ఆధారంగా దర్యాప్తు ప్రారంబించారు. కత్తితో దాడి జరిగే సమయంలో చేయ్యి అడ్డుపెట్టడాలేక కావాలనే చేతి గుత్తిని తీసుకువెళ్లారా అనే విషయమై పోలీసులు విచారణ చేస్తున్నారు. హత్య జరిగిన పరిసర ప్రాంతాల్లో చేతి వేళ్ల, హత్యకు ఉపయోగించిన ఆయుధాల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. హత్యకు వివాహేతర సంబంధమా లేక మరే ఇతర కారణమైనా ఉందా అని వివిధ కోణాల్లో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు గల కారణాలు పూర్తిస్థాయిలో తెలియాల్సి ఉన్నాయి.ఈ విషయం కుటుంబీ కులకు తెలియడంతో కన్నీటి పర్యంతం అయ్యారు. మృతుడికి భార్య అనంతలక్ష్మి, కుమార్తె శ్రీవల్లీ ఉన్నారు. ఇటీవల కుమార్తెకు వివాహమైంది. ఉగాది పండుగను పురస్కరించుకుని అల్లుడు తారక్‌రెడ్డి గురువారం ఉదయం ఇంటికి వచ్చాడు. విషయం తెలియడంతో సంఘటనా స్థలానికి చేరుకుని బంధువులకు సమాచారం అందజేశారు. మృతుడి ఒంటిపై బంగారు గొలుసు, బంగారు కడియం, చేతికి బంగారు ఉంగరాలు 4 ఉండేవని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభాకరరావుకు ఎవరో ఫోన్ చేసి బయటకు రప్పించారని, 8-30 గంటల నుంచి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుందని కుటుంబీకులు తెలుపుతున్నారు.భార్య పెండ్యాల అనంతలక్ష్మి ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు.హత్య జరిగిన సంఘటనా స్థలాన్ని అడిషనల్ ఎస్పీ ఏ.వి.వి. సుబ్బరాజు పరిశీలించి సూచనలు చేశారు.కేసు దర్యాప్తులో రూరల్ సీఐ కె.విజయ్‌బాబు, దేవరపల్లి సీఐ డి.నాగేశ్వరనాయక్, కొవ్వూరు పట్టణ, మండలం, దేవరపల్లి ఎస్ఐలు పాల్గొన్నారు.

ఆర్‌డీవో కార్యాలయం వద్దకు అని చెప్పి వెళ్లి

ప్రభాకరరావు ఆర్‌డీవో కార్యాలయం వద్దకు వెళుతున్నానని చెప్పారని కుటుంబీకులు చెబుతున్నారు. అయితే రాత్రి దొమ్మేరు తోటల వద్దకు ఎందుకు వెళ్లారనేది అనుమానా స్పదంగా మారింది. మృతుడి యాక్టివా కూడా రోడ్డు పక్కగా పార్క్‌చేసి ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. మృతుడిపై సంఘటనా స్థలంలోనే దాడి చేసినట్టు పోలీసులు గుర్తించారు. డాగ్ స్క్వాడ్ కూడా ఎక్స్‌ప్రెస్ హైవే వరకూ వెళ్లడంతో హత్యకు పాల్పడిన వారు అటుగా పారిపోయి ఉంటారని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రాత్రి 8 గంటల సమయంలో మృతుడికి చివరగా ఫోన్ చేసింది ఎవరనే దానిపై దర్యాప్తు చేస్తున్నారు.

ఫార్మాలజిస్ట్ ఆత్మహత్యాయత్నం కేసులో

నిందితుడు దీపక్ అరెస్ట్

» ఇంకా బాధితులెవరైనా ఉంటే సమాచారం ఇవ్వండి
» వివరాలు గోప్యంగా ఉంచుతాం : డీఎస్పీ భవ్య కిశోర్
» నిలకడగా బాధిత యువతి ఆరోగ్యం : వైద్యులు



కేసు వివరాలు తెలుపుతున్న డీఎస్పీ భవ్య కిశోర్, చిత్రంలో సీఐ బాజీలాల్, ఎస్ఐ శివప్రసాద్

రాజమహేంద్రవరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కిమ్స్ బొల్లినేని ఆస్పత్రిలో ఫార్మాలజిస్ట్ గా పనిచేస్తున్న నల్లపు నాగాంజలి ఆత్మహ త్యాయత్నం కేసులో నిందితుడిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సౌత్‌జోన్ డీఎస్పీ ఎస్. భవ్యకిశోర్ వివరాలను వెల్లడించారు. ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం రౌతుగూడెం గ్రామానికి చెందిన నల్లపు దుర్గారావుకు మార్తె నాగాంజలి వికాస్ ఫార్మసీ కళాశాలలో ఫార్మ్-డి ఫైనలియర్ చదువుతోంది. ప్రకాశనగర్‌లోని కిమ్స్ బొల్లినేని ఆస్పత్రిలో 9నెలల నుంచీ ఫార్మాలజిస్ట్‌గా పనిచేస్తోంది. అదే ఆస్పత్రిలో ఏజీఎం/మెడికల్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న దువ్వాడ మాధవరావు దీపక్ కార్యాలయం పక్కన ఉన్న ఒక గదిలో ఉంటోంది. పది రోజుల కిందట యువతి తండ్రి దుర్గారావు కు మార్తె గదికి వెళ్లిన సమయంలో ఆమె నీరసంగా ఉండడం గమనించి ప్రశ్నించారు. దీపక్ అనే వ్యక్తి తనను ప్రేమ పేరుతో మోసగించి వేధింపులకు పాల్పడుతున్నట్టు తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారని చెప్పారు. ఇదిలావుండగా ఈ నెల 23న నాగాంజలి కళ్లు తిరిగి పడిపోయిందని తండ్రి ఫోన్ చేయగా బంధువులతో కలిసి వచ్చి చూడగా అపస్మారక స్థితిలో ఉందన్నారు. ఆమె గదిలోని డైరీలో లభించిన సూసైడ్ నోట్‌లో దీపక్ తనను మోసగించాడని.. అతడి టార్చర్ భరించలేక వేక్యూనోరియం బ్రోమైడ్ 10 ఎంజీ ఇంజక్షన్ తీసుకున్నానని.. తన చావుకు అతడే కారణమని రాసినట్టు తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దీపక్‌ని నిందితుడిగా గుర్తించామని డీఎస్పీ తెలిపారు. అతడు పరారీలో ఉండడంతో ఎస్పీ నరసింహకిశోర్ ఆదేశాలతో ప్రకాశం నగర్ సీఐ ఆర్‌ఎస్‌కే బాజీలాల్ నేతృత్వంలో ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటుచేసి నిఘా పెట్టామన్నారు. తమకు అందిన సమాచారంతో నిందితుడు దీపక్‌ని గురువారం ఉదయం రాజమహేంద్రవరంలో సీఐ బాజీలాల్ అరెస్టు చేశారన్నారు. మహిళలు, యువతులు, బాలికలకు ఏవైనా ఇలాంటి తీవ్రమైన సమస్యలు ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేస్తే తగుచర్యలు తీసుకుంటామన్నారు. బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఆత్మహత్య వంటి నిర్ణయాలు తీసుకోవద్దన్నారు. దీపక్ బాధితులు ఇంకా ఎవరైనా సమస్యలు ఎదుర్కొని ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. బాధితురాలు, నిందితుడి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. బాధితురాలి ఫోన్‌లో డేటా డిలీట్ చేశారనే అనుమానాలు వ్యక్తంచేస్తున్నారని..సెల్‌ఫోన్లను ఫోరెన్సిక్ సైన్సు ల్యాబ్‌కి పంపించామని చెప్పారు. ఒకవేళ అలాంటిది ఏమైనా జరిగినా డేటాను రిట్రీవ్ చేయిస్తామన్నారు. కేసులో ప్రతిభచూపిన సీఐ బాజీలాల్, ఎస్ఐ ఎస్.శివప్రసాద్, పీసీలు వి. శివప్రసాద్, జే.ఈశ్వరరావును ఎస్పీ నరసింహకిశోర్ అభినందించి రివార్డులు ప్రకటించారు.

కండీషన్ సీరియస్‌గానే ఉంది

● డాక్టర్ దీపక్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్న అంజలి పరిస్థితి విషమంగానే ఉందని కిమ్స్ బొల్లినేని ఆసుపత్రి జనరల్ మెడిసిన్ వైద్యుడు దీపక్ తెలిపారు. ఈ మేరకు గురువారం డాక్టర్ రామరాజుతో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు. అంజలి బ్రెయిన్‌కి రక్తసరఫరా తగ్గడం వల్ల డ్యామేజీ అయ్యిందని, బ్రెయిన్‌డెడ్ కాలేదని చెప్పారు. రికవరీ అవకాశాలు చాలా తక్కువ ఉన్నాయని, కండీషన్ సీరియస్‌గానే వుందన్నారు. వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. మరోపక్క అంజలి ఆరోగ్యంగా రావాలని తల్లిదండ్రులు, బంధువులు ఆసుపత్రివద్ద పడిగాపులు గాస్తున్నారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య



నాయుడు లక్ష్మి

ముమ్మిడివరం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న ఓ వృద్ధురాలు జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం గేదెల్లంక పంచాయతీ హనుమాన్ సెంటర్‌కు చెందిన నాయుడు లక్ష్మి (74) బుధవారం ఈ అఘాయిత్యానికి పాల్పడింది. అల్సరు వ్యాధితో గత ఐదేళ్లుగా బాధపడుతున్న ఆమె ఎన్ని మందులు వాడినా తగ్గకపోవడంతో ఆమె భర్త పట్టాబి పెరాలసిస్ వ్యాధితో మంచానికి పరిమితమవ్వడం, ఇద్దరు కుమారుల్లో చిన్న కుమారుడు రామకృష్ణ గుండెపోటుతో మృతిచెందడం వంటి వాటితో విరక్తి చెందిన లక్ష్మీ బుధవారం పురుగులమందు తాగి అపస్మారక స్థితికి లోనవ్వడంతో బంధువులు ఆమెను అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈమె గతంలో గేదెల్లంక ఎంపీటీసీగా పనిచేశారు. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్ఐ బి.జ్వాలాసాగర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి

రౌతులపూడి, మార్చి27(ఆంధ్రజ్యోతి) రాజవరం గ్రామానికి చెందిన దార్ల వీరాచార్యులు(65) మృతి చెందాడు. సైకిల్ పై వేళ్లుతున్న సమయంలో ట్రాక్టర్ ట్రక్కు ఢీకోనడంతో ట్రాక్టర్ కిందపడి మృతి చెందాడు. మృతిడికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీస్‌లు కేసు నమోదు చేసారు. పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

లాడ్జిలో వ్యక్తి మృతి



ప్రతీప్ మృతదేహం

కాకినాడ క్రైం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ బాలాజీ చెరువు సెంటర్లోని ఓ లాడ్జిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసారు. వివరాలు ఇలా వున్నాయి... కృష్ణా జిల్లా రాయనగరం గ్రామానికి చెందిన పాతపాటి ప్రతీప్ (41) బాంబినో సేమ్యా కంపెనీలో ఏరియా సేల్స్ మేనేజర్‌గా పని చేస్తున్నా డు. కాకినాడలో ఉన్న డిస్ట్రిబ్యూటర్లను కలిసేందుకు నెలలో రెండుసార్లు వస్తుంటాడు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం కాకినాడ వచ్చి వసుధ లాడ్జిలో దిగాడు. బుధవారం రాత్రి గదిలో మద్యం సేవించాడు. ఉదయం రూమ్ బోయ్ చూసేసరికి విగతజీవిగా పడి ఉన్నాడు. అతడు గుండె పోటుతో మరణించి ఉంటాడని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. కాకినాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రైల్వే భద్రతా విభాగాలను పరిశీలిస్తున్న భద్రతా ఈడీ త్రిపాఠి

రైల్వే సేఫ్టీ ఉన్నతాధికారి సందర్శన

సామర్లకోట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రైల్వే బోర్డు కార్యనిర్వాహక సంచాలకుడు (భద్రత) అధికారి డీఎం త్రిపాఠి (న్యూఢిల్లీ) గురువారం కాకినాడజిల్లా సామర్లకోట రైల్వేస్టేషన్ పరిధిలో పలు భద్రతా విభాగాలను పరిశీలించి భద్రతా చర్యలకు ఇస్తున్న ప్రాధాన్యతాక్రమాన్ని స్వయం గా తెలుసుకున్నారు. సిగ్నలింగ్, టెలికమ్యూని కేషన్ అంశాల్లో నూతన పద్ధతులను ఏ రీతిలో అమలు చేస్తున్నారో తెలుసుకున్నారు. ప్రయా ణికుల భద్రతకు పటిష్ట వ్యవస్థలో భాగంగా కవచ్‌ను ఇటీవలి కాలంలో అమలు చేస్తుండడంతో దాదాపు ప్రమాదాలకు ఎర్రజెండా పడిన ట్లైంది. దక్షిణమధ్య రైల్వేలో విజయవంతంగా అమలు చేస్తున్న కవచ్ భద్రతా వ్యవస్థ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో విస్తరించి ఉన్న 130 కిలోమీటర్ల మేర రైలు ట్రాక్ వెంబడి భద్రతా చర్యల పనితీరుపై ఈడీ త్రిపాఠి పరిశీలించి సం తృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందు సామ ర్లకోట రైల్వేస్టేషన్లో ప్రత్యేక రైలు దిగిన ఈడీకి సామర్లకోట రైల్వే సూపరింటెండెంట్ ఎం.రమే ష్ మొక్క అందించి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సామర్లకోట రైల్వేస్టేషన్ పరిధిలో వివిధ శాఖల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న సుబ్బారావు తదితరులు

అంబాజీపేట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమజిల్లా పుల్లేటికుర్రు శివారు చినలంక వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి చెందింది. మతిస్థిమితంలేని ఈ మహిళ కోసం ఎవ్వరూ రాకపోవడంతో మాచవరం నాగాబత్తుల సాహేబ్ మోమోరియల్ ట్రస్టు చైర్మన్ నాగాబత్తుల సుబ్బారావు తన సొంత ఖర్చులతో పోలీసుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. యలమించిలి బుచ్చిబాబు, సత్యాల కొండలరావు, నాగాబత్తుల మధుబాబు సహకారంతో ప్రత్యేక వాహనంలో తీసుకుని వెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా గతంలో సుబ్బారావు ఇద్దరు అనాథలు మృతిచెందగా వారికి ట్రస్టు తరుపున అంత్యక్రియలు నిర్వహించారు. దీంతో వారి సేవలను ఎస్ఐ కె.చిరంజీవితోపాటు పలువురు అభినందించారు.

జి.అగ్రహారంలో డెంగ్యూ కేసు నమోదు

● అప్రమత్తమైన అధికారులు
● గ్రామంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు



గంగలకుర్రులో పారిశుధ్య పనులు చేపడుతున్న సిబ్బంది

అంబాజీపేట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారం పరిధిలోని దంగేటివారిపాలెంలో ఓ డెంగ్యూ కేసు నమోదైం ది. గ్రామానికి చెందిన రాయుడు పద్మ రెండు వారాల క్రితం అయినవిల్లి మండలం చింతనలంక కూలి పనికి వెళ్లింది. అయితే జ్వరం రావడంతో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించారు. జ్వరం తగ్గకపోవడంతో ఆమె బంధువులు కొత్తపేట సీహెచ్‌సీలో వైద్యం చేయించారు. అయితే మధ్య లో ఆమెకు చికెన్‌పాక్స్ రావడంతో మందులు వాడటం మానేసింది. దీంతో ఆమెకు జ్వరం విపరీతంగా రావడంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పద్మకు వైద్య పరీక్షలు నిర్వహించి డెంగ్యూగా నిర్ధారించారు. దీంతో అప్రమత్తమైన అధికారులు అంబాజీపేట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కేఎన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీహెచ్‌వో బి.అప్పారావు, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి ఎన్.మౌనిక ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు ఆ ప్రాంతం లో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆ ప్రాంతంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశా రు. మురుగునిల్వ లేకుండా చూసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సీహెచ్‌వో అప్పారావు సూచించారు.

కాకినాడ జిల్లా ఎస్పీని ఆశ్రయించిన ప్రేమజంట

కాకినాడ క్రైం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రేమించుకుని పెద్దలను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకున్నామని, తమ కుటుంబ స భ్యుల నుంచి ఎటువంటి ఇబ్బందులు లేకు ండా రక్షణ కల్పించాలని కోరుతూ నూతన వధూవరులు కాకినాడ జిల్లా ఎస్పీని కోరారు. గురువారం కాకినాడ జిల్లాపోలీసు కార్యాలయానికి వెళ్లి ఈ మేరకు వినతిపత్రం అందించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా పి.గన్నవరానికి చెందిన దూనబోయిన ఉమ, కాకినాడజిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరానికి చెందిన గుడాల చైతన్యవీర్ నాలుగేళ్లుగా ప్రేమించుకుని గురువారం ప్రేమ వివాహం చేసుకున్నారు. తాము మేజర్లమని, సామాజికపరంగా వేర్వేరు కులాలు కావడంతో పెళ్లికి పెద్దలు అంగీకరించకపోవడంతో వేరే గత్యంతరం లేక వివాహం చేసు కున్నామన్నారు. తామిద్దరం ఇష్టపూర్వకంగా ప్రేమ వివాహం చేసుకున్నామని ఇరు కుటుంబాల నుంచి ప్రాణ రక్షణ కల్పించాలని ఎస్పీని కోరారు. రెండు కుటుంబాలతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

టి.కొత్తపల్లి సొసైటీలో నిధులు స్వాహా

● రైతుల ఫిర్యాదుతో విచారణకు ఆదేశం

ఐ.పోలవరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): టి.కొత్తపల్లి సొసైటీలో నిధుల స్వాహాపై రైతులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. రైతులకు సేవలందించాల్సిన సొసైటీలు అవినీతి సంఘాలుగా తయారయ్యాయి. ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లి సొసైటీలో జరిగిన అవినీతి బాగోతాన్ని రైతులే స్వయంగా బట్టబయలు చేసి ఆ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. సొసైటీలో కార్యదర్శిగా పనిచేస్తున్న కె.తిరుమలకుమార్ నిధులు స్వాహా చేశారని రైతులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. గురువారం జరిగిన సర్వసభ్య సమావేశంలో అవినీతి అక్రమాలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరైన సహకార సంఘం అధికారి వెంకటనారాయణ ఎదుట నిధుల స్వాహా బాగోతంపై రైతులు మండిపడ్డారు. సుమారు రూ.20లక్షల సొసైటీ నిధులతో పాటు రైతులకు జమ చేయాల్సిన మూడు శాతం వడ్డీ రాయితీ నిధులను కార్యదర్శి పక్కదారి పట్టించారని రైతులు ఆరోపించారు. రైతుల రుణాలు కట్టించుకోవడంలో కూడా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని వ్యాఖ్యానించారు. సొసైటీ అక్రమాలపై రైతులు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుకు ఫిర్యాదు చేశారు. దీనిపై మురమళ్ళ డీసీసీబీ మేనేజర్ మనోహర్‌ను వివరణ కోరగా సొసైటీలో అక్రమాలు జరిగాయని రైతులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై సూపర్‌వైజర్ సుంకర శ్రీరామ్‌కుమార్‌ను విచారణకు ఆదేశించామన్నారు. నివేదిక అనంతరం చర్యలు ఉంటాయన్నారు.

మన్యం సమస్యలపై సీఎంకి ఎమ్మెల్యే శిరీష వినతి

● రంప నియోజకవర్గంలో నిర్వాసితుల సత్వర న్యాయానికి చంద్రబాబు భరోసా



చంద్రబాబుతో రంప ఎమ్మెల్యే శిరీష

రంపచోడవరం, మార్చి27(ఆన్‌లైన్): మన్యం సమస్యలపైనా, పోలవరం నిర్వాసితుల సమస్యల పైనా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించి రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవికి భరోసా ఇచ్చారు. గురువారం పోలవరం వచ్చిన ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే శిరీష కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రంపచోడవరం నియోజకవర్గంలోని పలు సమస్యలపైనా, పోలవరం నిర్వాసితుల పునరావాస సమస్యలపైనా విన్నవించారు. ఆయా సమస్యలను పరిష్కరిస్తామని చంద్రబాబు పేర్కొన్నారు. అనంతరం నిర్వాసితులతో సమా వేశమైన ఆయన గత ఐదేళ్లలో పోలవరం ప్రగతి నిలిచిపోవడం, నిర్వాసితుల పరిహారం, పునరావాసం అంశాలను సైతం జగన్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వంటి అంశాలను ఆయన నిర్వాసితు లతో ప్రస్తావించారు. పోలవరం నిర్మాణ పనుల తోపాటు పునరావాస చర్యల ప్రగతిని కూడా సమాంతరంగా సమీక్షిస్తామని, నిర్వాసితులకు అందించాల్సిన పునరావాస ప్యాకేజీని కూడా పెద్ద ఎత్తున కూటమి ప్రభుత్వం నేరుగా నిర్వాసితుల ఖాతాల్లోకి చెల్లించామని చంద్రబాబు అన్నారు. జగన్ మాదిరిగా కల్లబొల్లి కబుర్లను చెప్పి నిర్వాసితులను మోసంచేసే పాలనలే దని ఆయన పేర్కొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌పై చర్యలు

కాకినాడ క్రైం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం రూరల్ ఎస్ఐ గుణశేఖర్ ఈనెల 24న లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ విషయం తెలిసిందే. లోతైన విచారణ చేపట్టిన ఏసీబీ అధికారులకు కాకినాడ ఎస్‌డీపీవో కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను పర్యవేక్షించే హెడ్ కానిస్టేబుల్ సింహాద్రినాయుడు పాత్ర ఉన్నట్లు గుర్తించారు. విచారణలో భాగంగా ఎస్ఐతో పాటు అతని డ్రైవర్ సెల్‌ఫోన్‌లను పరిశీలించగా గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారా సింహాద్రినాయుడుకు తరుచూ డబ్బులు పంపినట్లు నిర్ధారణ అయింది. ఈ విషయాన్ని ఏసీబీ అధికారులు కాకినాడ జిల్లా ఎస్పీకి నివేదించారు. పలు కేసుల్లో నిరాధార ఆరోపణల నేపథ్యంలో బయటపడే వ్యక్తుల పేర్లు తొలిసారి స్థానిక పోలీస్‌స్టేషన్ల అధికారుల కంటే ముందుగానే సింహాద్రినాయుడుకు తెలుస్తాయి. ఆ సమయంలో అతడు పోలీస్‌స్టేషన్లకు ఫోన్‌చేసి మీ స్టేషన్ పరిధిలో నమోదైన ఫలానా అట్రాసిటీ కేసులోని వ్యక్తులు ఆ కేసులో దోషులుగా నిరూపించలేదు కాబట్టి వాళ్ళ మీద ఎటువంటి కేసు ఉండదు అని సంబంధిత పోలీస్ అధికారులకు చెప్పి ఈ కేసు నుంచి మేము మిమ్మల్ని బయటపడేస్తాం అని చెప్పి వాళ్ళని డబ్బులు అడగండి అని చెప్పి ప్రోత్సహించేవాడు. ఇలాగే గత కొన్నాళ్లుగా అన్ని స్టేషన్ల తోను రాయబారాలు నడిపాడు. సదరు పోలీస్ అధికారులు డబ్బులు వసూలు చేసి కొంత వారు తీసుకుని కొంత సింహాద్రినాయుడుకు పంపేవారు. ఈ క్రమంలోనే పిఠాపురం రూరల్ ఎస్ఐకి కూడా ఇదే సలహా ఇచ్చి ఆయన్ను ఇరికించడంతోపాటు నాయుడు ఇరుక్కున్నాడు. ఈ ఆరోపణలు రుజువు కావడంతో సింహాద్రినాయుడుని ఎస్పీ వీఆర్‌కు పంపుతూ నిర్ణయం తీసుకున్నారు. కొద్ది రోజుల్లో అతనిపై వేటు వేయనున్నట్టు సమాచారం.

రాష్ట్రంలో సారా నిర్మూలనకు కృషి చేయాలి

● రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌రాహుల్‌దేవ్ శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న కాకినాడ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రేణుక

ప్రత్తిపాడు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాటుసారా నిర్మూలనకు అన్నివిధాలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ కోరారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు ఎక్సైజ్‌స్టేషన్‌లో గురువారం జిల్లా ఎక్సైజ్ నేరాల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్నా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌శర్మ మాట్లాడుతూ ప్రతిగ్రామం నాటుసారా లేని గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు. నవోదయం2.0 కార్యక్రమం ద్వారా నాటుసారావల్ల జరిగే దుష్పరిణామాలు ప్రజలకు వివరించాలని సూచించారు. గంజాయి తదితర ఎక్సైజ్ నేరాలు అదుపునకు అన్నివిధాలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రేణుక మాట్లాడుతూ నవోదయం 2.0లో భాగంగా మారుమూల గ్రామాల్లో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణకుమారి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జయమౌనికలు జిల్లాలో ఎక్సైజ్ నేరాల అదుపునకు తీసుకుంటున్న చర్యలు ఎక్సైజ్ నేరాల పరిస్థితి వివరించారు. ప్రతి గ్రామంలో కమిటీలు ఏర్పాటుచేసి నాటుసారా తదితర ఎక్సైజ్ నేరాలపట్ల ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఎక్సైజ్ సీఐ పి. శివప్రసాద్‌తోపాటు జిల్లాలోని ఏఈ ఎస్‌లతో పాటు అన్ని సర్కిల్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఆదిత్య పూర్వ విద్యార్థి భారతదేశ పాదయాత్ర

● ఇప్పటి వరకు 27 రాష్ట్రాలు, 5 కేంద్ర పాలిత ప్రాంతాల్లో పూర్తి



పూర్వవిద్యార్థిని అభినందిస్తున్న ఆదిత్య యాజమాన్యం శేషారెడ్డి

గండేపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో 2019 నుంచి 2023 విద్యా సంవత్సరంలో పెట్రోలియం టెక్నాలజీ ఇంజనీరింగ్ విభాగంలో విద్యనభ్యసించిన విద్యార్థి చి.తిలోత్తమన్, ఎస్.సంపూర్ణ భారతదేశ యాత్ర తలపెట్టి ఇప్పటివరకు 27 రాష్ట్రాలు, ఐదు కేంద్ర పాలిత ప్రాంతాలు చుట్టివచ్చారు. గురువారం ఆదిత్య విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన తిలోత్తమన్ ఆదిత్య ప్రో ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డిని కలుసుకుని తాను భారతదేశ యాత్ర(కాలి నడకన, బైల్ లిఫ్ట్) చేస్తున్న సంగతి వివరించారు. డాక్టర్ సతీష్‌రెడ్డి తిలోత్తమన్‌ను అభినందించారు. యాత్ర విజయవంతం కావాలని అనుకున్న లక్ష్యం నెరవేరాలని శుభాకాంక్షలు తెలిపారు. ఆదిత్య యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డిని గౌరవపూర్వకంగా కలిసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. ఈసందర్భంగా తిలోత్తమన్ మాట్లాడుతూ 2024నవంబరు 11న కుంభకోణం తమిళనాడులో తన యాత్ర ప్రారంభించానన్నారు. ఇది పూర్తిగా నగదు రహిత ఒక్క రూపాయి ఖర్చులేకుండా పాదయాత్ర లేదా ఎవరైనా రహదారి వెంట వాహనదారుల సహకారంతో లిఫ్ట్ అడిగి ప్రయాణించానన్నారు. ఆయా ప్రాంతాల్లో గుడి, వసతి సత్రం, అన్నదాన కేంద్రాల్లో ఆహారం స్వీకరించి ప్రయాణం కొనసాగిస్తున్నట్లు వివరించారు. యువత మత్తుపదార్థాల వల్ల బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవడం కుటుంబాలను ఛిద్రం చేసుకోవడం చూశానని, తన యాత్ర యువతపై ఎక్కువ ప్రభావం చూపుతుందనే ఉద్దేశ్యంతో యాత్ర ప్రారంభించానన్నారు. వివిధ రాష్ట్రాల సంస్కృతి, సాంప్రదాయలను, భాషలను, వ్యక్తుల అభిరులు తెలుసుకున్నానన్నారు. ఏప్రిల్ నెలాఖరుకి యాత్ర కుంభకోణంలో పూర్తి చేస్తానని తెలిపారు.

రేపు తునిలో మెగా జాబ్ మేళా

కాకినాడ సిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తునిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కాకినాడ వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. సుమారు 30 కంపెనీల్లో 1,159 ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. స్మార్ట్ బ్రెయిన్స్, హిప్నోక్లౌవ్డ్ టెక్నాలజీస్, సదర్‌లాండ్ గ్లోబల్, సర్వీసెస్, డబ్ల్యుఎన్, ఎస్.గ్లోబల్ సర్వీసెస్, ఐసాన్ ఎక్స్‌పీరియన్సెస్, కోజెంట్ ఇ-సర్వీ సెస్, నిట్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇసుజు మోటార్స్, పానాసోనిక్, ఫాక్స్‌కాన్, హ్యుండాయ్ మోబీస్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఎస్ఎస్‌సీ నుంచి పీజీ వరకు ఉత్తీర్ణులైన 35 సంవత్సరాల్లోపు అభ్యర్థులు అర్హులన్నారు. నెలకు రూ.13 వేల నుంచి రూ.50వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్ భోజనం, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు శనివారం ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 77993 76111 నెంబరును సంప్రదించాలన్నారు.



ఎమ్మెల్యే కొండబాబుకు జ్ఞాపిక అందజేస్తున్న ఉమ్మడి జిల్లా ఎన్జీవో సంఘ ప్రతినిధులు

'ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిల చెల్లింపు హర్షణీయం'

కాకినాడ సిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.6,200 కోట్ల బకాయిలు చెల్లించడం హర్షణీయమని ఉమ్మడి జిల్లా ఎన్జీవో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు గుద్దటి రామ్మోహనరావు, పేపకాయల వెంకటకృష్ణ పేర్కొన్నారు. గురువారం వారు కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబును కలిసి కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా క్రీడా పోటీలకు సహకారం అందించడంపై ఉమ్మడి జిల్లా ఎన్జీవో మహిళా విభాగం చైర్ పర్సన్ బి.సుజాత, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి ఎమ్మెల్యేకు జ్ఞాపిక అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్జీవో సంఘం జిల్లా సహాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు, కాకినాడ నగర శాఖ అధ్యక్షుడు అరదాడి సత్తిరాజు, మహిళా విభాగం జిల్లా సహ చైర్‌పర్సన్ భారతి, కాకినాడ నగర శాఖ సంయుక్త కార్యదర్శి బి.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పి.వేమవరం ఉప సర్పంచ్‌గా వీర్రాఘవమ్మ

సామర్లకోట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.వేమవరం ఉప సర్పంచ్‌గా 7వ వార్డు సభ్యురాలు మేడిది వీర్రాఘవమ్మ ఎన్నికయ్యారు. గతంలో ఉప సర్పంచ్‌గా వున్న అత్తిలి సుబ్బలక్ష్మి పదవికి రాజీనామా చేయడంతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేసేందుకు ప్రత్యేకాధికారి ఎన్ఎస్ఎన్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఎన్నిక నిర్వహించారు. వార్డు సభ్యులు 11 మంది హాజరుకావడంతో ఎన్నిక ఏకపక్షంగా జరిగింది. పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరి రాజు ఆధ్వర్యంలో సీఐ శ్రీకృష్ణభగవాన్, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. వీర్రాఘవమ్మకు ఎన్నికల ప్రత్యేకాధికారి ఎన్ఎస్ఎన్ రెడ్డి ధ్రువీకరణ పత్రం అందజేశారు. అనంతరం ఆమె పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ఆయన తనయుడు రంగనాగ్‌లను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వీర్రాఘవమ్మను ఎమ్మెల్యే చినరాజప్ప, కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) వీర్రాఘవమ్మను అభినందించారు. ఆమెను మునిరెడ్డి శ్రీరాములు, మునిరెడ్డి రాంబాబు ఆధ్వర్యంలో పూలమాలలతో ముంచెత్తి అభినందిం చారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సామర్లకోట మండలం పి.వేమవరం ఉప సర్పంచ్‌గా ఎన్నికైన వీర్రాఘవమ్మకు ధ్రువీకరణ పత్రం ఇస్తున్న ఎన్నికల ప్రత్యేకాధికారి రెడ్డి

కలెక్టరేట్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): పెదపూడి మండలం రామేశ్వరం పంచాయతీ ఉప సర్పంచ్ పదవికి ఎన్నికల ప్రత్యేక అధికారి సమక్షంలో గురువారం ఎన్నిక నిర్వహించారు. ఉప సర్పంచ్‌గా డి.వీరవెంకట సత్యనారాయణ ఎన్నికయ్యారు.

'రాజీవ్ గృహకల్ప'లో అధ్వాన పారిశుధ్యం

పిఠాపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో రాజీవ్‌గృహకల్ప అపార్ట్‌మెంట్ల సముదాయం వద్ద అధ్వాన పారిశుధ్య పరిస్థితులను మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ గురువారం పరిశీలించారు. డ్రైన్లు పొంగిపొర్లుతున్నాయని, తాగునీటి పైపులైన్లు పగిలిపోయాయని, ట్యాంకులను శుభ్రం చేయకపోవడంతో ప్రజలు కలుషిత తాగునీరు తాగాల్సి వస్తోందన్నారు. ఈ పరిస్థితులను కలెక్టర్ షాన్ మోహన్ దృష్టికి తీసుకెళ్లగా వారంలో మెరుగుపరుస్తామన్నారు. టీడీపీ నాయకులు సోము సత్యనారాయణ, కొరుప్రోలు శ్రీను, అల్లవరపు నగేష్, నల్లా శ్రీను, వాసంశెట్టి సూరిబాబు, ఆగంటి లోవ, గాయత్రి, కేతవరపు కృష్ణ, కర్నాసుల రాజా, రాయవరపు తిరుమలరావు, గుత్తుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అధ్వాన పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

రంజాన్ ప్రార్థనల్లో ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన నూరానీ జామియా మసీదులో ముస్లింలతో కలిసి పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపి ఇఫ్తార్ విందు స్వీకరించారు. టీడీపీ జనసేన, బీజేపీ నాయకులు, ముస్లిం మత పెద్దలు ఎండీ గౌస్, షేక్ అమీర్, ఎండీ సైపుల్లా, మత గురువులు పాల్గొన్నారు.



ముస్లింలతో కలిసి ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

అభివృద్ధి పనుల పరిశీలన

సామర్లకోట మండలంలోని వేట్లపాలెంలో వివిధ వార్డుల్లో నిర్మిస్తున్న డ్రైన్లు, సీసీ రోడ్ల అభివృద్ధి పనులను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప గురువారం పరిశీలించారు. ఆయన వెంట ఉప సర్పంచ్ గోలి శ్రీరామ్‌చౌదరి, టీడీపీ నాయకులు గుమ్మళ్ల రామకృష్ణ, నవీన్, సంగమేశ్వరరావు, గోలి భద్రరావు వున్నారు.

అసాంఘిక కార్యకలాపాలు నిరోధించండి

డిప్యూటీ సీఎం ఓఎస్డీ మధుసూదన్‌కి కోచ్‌ల వినతి

పిఠాపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు అనువుగా ఉండాల్సిన ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారిందని, వాటిని నిరోధించాలని ఆర్చరీ కోచ్ పి.లక్ష్మణరావు, రగ్బీ కోచ్ బళ్ల వంశీ కోరారు. పాత బస్టాండు వద్ద గల క్రీడా మైదానాన్ని, అక్కడ నిర్మాణంలో ఉన్న మినీ స్టేడియాన్ని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఓఎస్‌డీ మధుసూదన్, పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్ర వర్షిణి, ఇతర అధికారులు గురువారం పరిశీలించారు. కోచ్‌లు క్రీడా మైదానం పరిస్థితిని వివరించారు. ఇండోర్ స్టేడియం చుట్టూ ప్రహరీ నిర్మించాలని, క్రీడాకారులకు వసతి గదులు ఏర్పాటు చేయాలని కోరారు. గ్రౌండ్ జిగురుగా ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, గ్రావెల్ వేయించాలన్నారు. ప్రతి ఏటా ఇక్కడ పెట్టే ఎగ్జిబిషన్ కారణంగా మైదానం పాడవుతోందని తెలిపారు. మైదానం లోపల, బయట వ్యాపారాలు, చేపల విక్రయాలు జరుగుతున్నాయని, దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని చెప్పారు. క్రీడా మైదానం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానం పరిస్థితిని డిప్యూటీ సీఎం ఓఎస్డీ మధుసూదన్, పాడా పీడీ చైత్రవర్షిణిలకు వివరిస్తున్న కోచ్ లక్ష్మణరావు



అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

పనుల పురోగతిపై ప్రతివారం సమీక్ష



అధికారులకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దిశానిర్దేశం

పిఠాపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, మౌలిక వసతుల కల్పన విషయంలో చురుగ్గా వ్యవహరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. పిఠాపురం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను డిప్యూటీ సీఎం పేషీ అధికారులు, పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి గురువారం పరిశీలించారు. ఆ వివరాలను పవన్‌కల్యాణ్‌కు తెలియజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పలు అంశాలపై అధికారులతో సమీక్షించి వారికి దిశానిర్దేశం చేశారు. పనుల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పురోగతిని పరిశీలించాలన్నారు. పనుల నాణ్యతా ప్రమాణాలను పరిశీలించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. తన కార్యాలయం దృష్టికి వచ్చిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు ప్రత్యేక వ్యవస్థ పనిచేస్తుందన్నారు. విద్యుత్ అంతరాయం సమస్య ఉందని తెలియగానే పిఠాపురంలోని టిడ్కో గృహాల వద్ద రూ.3 కోట్ల వ్యయంతో 5ఎంవీఏ సామర్థ్యంతో కొత్త సబ్‌స్టేషన్ పనులు చేపట్టామని చెప్పారు. అమృత్-2.0 పథకం ద్వారా పిఠాపురం పట్టణంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు మునిసిపల్ అధికారులతో ఇప్పటికే మాట్లాడామని తెలిపారు. పిఠాపురంలోని ఉప్పాడ రైల్వే గేటు వద్ద ఆర్వోబీ నిర్మాణానికి రూ.59.70కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.40.2 కోట్ల వ్యయంతో 444 రోడ్ల నిర్మాణ పనులు చేపట్టామని తెలిపారు. నియోజకవర్గానికి 431 గోకులాలు మంజూరు చేసినట్టు చెప్పారు. పిఠాపురం సీహెచ్‌సీని 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశామని, సౌకర్యాలు, భవనాల కోసం రూ.38.32 కోట్ల నిధులు వచ్చాయని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధిపై శ్రద్ధ చూపిస్తోంది అనేందుకు ఇవే నిదర్శనాలన్నారు.

నియోజకవర్గ పరిధిలోని గ్రామాలు, పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. వేసవి సమయంలో ఎక్కడా తాగునీటి సమస్య అనేది ఉండకూడదని స్పష్టం చేశారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు, తాగునీటి పథకాలను నిరంతరం తనిఖీ చేయాలని సూచించారు. అభివృద్ధి పనుల పురోగతిపై నివేదికలు సిద్ధం చేయాలన్నారు

తాగునీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలి

వేసవిని దృష్టిలో ఉంచుకుని ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఓఎస్డీ మధుసూదన్ సూచించారు. పట్టణంలోని పాడా కార్యాలయంలో గురువారం సాయంత్రం 15 ప్రభుత్వ శాఖల ద్వారా పిఠాపురం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన పనులు, ఇతర అంశాలపై ఆయన అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. ఇప్పటికే మంజూరైన పనులను త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో పాడా పీడీ ఎ.చైత్రవర్షిణి, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, వివిధ శాఖల జిల్లా, డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

'కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షల తేదీ ప్రకటించాలి'

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థుల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, తక్షణం స్పందించి మెయిన్స్ పరీక్షల తేదీలను ప్రకటించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న డిమాండ్ చేశారు. గురువారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ అభ్యర్థులు బాలాజీచెరువు సెంటరు నుంచి ర్యాలీగా బయల్దేరి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అనంతరం అక్కడ ధర్నా చేశారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ గత ప్రభుత్వం 2022 నవంబరు 28న 6,100 పోలీసు కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. జనవరిలో జరిగిన ప్రిలిమ్స్ పరీక్షలకు 4.52 లక్షల మంది హాజరు కాగా 92వేల మంది అర్హత సాధించారని, రెండేళ్ల పోరాటం తర్వాత ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించారని, కోర్టు కేసులంటూ జాప్యం చేయడం తగదన్నారు. మూడేళ్లుగా నిరుద్యోగులు కోచింగ్ ఫీజులు, ఇంటి అద్దెలు కట్టలేక ఇబ్బందిపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నియామకానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనాకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ ప్రసాద్, జిల్లా నాయకుడు టి.రాజా, కానిస్టేబుల్ అభ్యర్థులు పవన్, నాయుడు, వేణుగోపాల్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులు

బడి ఈడు పిల్లలంతా బడుల్లో ఉండాలి: డీఈవో రమేష్

కాకినాడ రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల్లో నాణ్యమైన విద్యాబోధన సాధ్యమని, ఇంగ్లిష మీడియంతో పాటు మౌలిక సదుపాయాలను కల్పించామని, ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు చేరేలా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ కోరారు. పీఆర్టీయూ, ఎస్టీయూ, వివిధ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరం ప్రారంభం కంటే ముందే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేలా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండేలా కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ పాఠశాలల తెరిచేలోపు అడ్మిషన్ల కోసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాలలకు అవసరమైన కరపత్రాలను యంగ్‌మైండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అందజేస్తున్నామని ఫౌండర్ కమ్ ప్రెసిడెంట్ వాకాడ వెంకటరమణ (చిన్న మాస్టారు) తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎంల అసోసియేషన్ ప్రెసిడెంట్ చేపూరి రవి, డీసీఈబీ సెక్రటరీ ఎం.వెంకటరావు, పీఆర్టీయూ సెక్రటరీ నూకరాజు, ఎస్టీయూ అధ్యక్షుడు కె.కాశీవిశ్వనాథ్, సెక్రటరీ మోర్త శ్రీనివాస్, టీఎన్‌యూఎస్ ప్రతినిధులు లక్ష్మణదొర, డీవీవీ బాపిరాజు, వంగాశ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు ఉగాది కవి సమ్మేళనం

పెద్దాపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఉగాది సందర్భంగా పెద్దాపురం సాహితీ స్రవంతి, యూటీఎఫ్, ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో శనివారం యానలపు సూర్యారావు భవనంలో ఉగాది సాహిత్య సభ, కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు సాహితీ స్రవంతి కార్యదర్శి కొత్త శివ తెలిపారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జోస్యుల కృష్ణబాబు అధ్యక్షతన జరిగే సభలో యూటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి జి.ప్రభాకరవర్మ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గనారా, కాకినాడ నగర శాఖ అధ్యక్షుడు మార్ని జానకిరామచౌదరి, పెద్దాపురం శాఖ గౌరవాధ్యక్షుడు చల్లా విశ్వనాథం, యూటీఎఫ్ మండల కార్యదర్శి జాన్ కెనడీ, పట్టణ శాఖ కార్యదర్శి బేబీగంగారత్నం, ప్రజానాట్యమండలి మండల శాఖ కార్యదర్శి రొంగల వీర్రాజు, జేవీవీ నాయకుడు బి.అనంతరావు ప్రసంగిస్తారని శివ చెప్పారు.



విద్యార్థినులు, శక్తి బృందం సభ్యులతో సీఐ రామచంద్రరావు

స్వీయ రక్షణపై శక్తి బృందాల శిక్షణ

కాకినాడ క్రైం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ శాఖ ఏర్పాటుచేసిన శక్తి బృందాల ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఎస్పీ జి.బిందుమాధవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా నగరంలోని సాలిపేట బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం మహిళా పోలీస్‌స్టేషన్ సిబ్బంది, శక్తి బృందాలు సంయుక్తంగా 7, 8, 9 తరగతుల బాలికలు సుమారు 200 మందికి ప్రత్యేక శిబిరంలో స్వీయ రక్షణలో మెళకువలను ప్రయోగాత్మకంగా నేర్పారు. విద్యార్థినులు అడిగిన ఆసక్తికర విషయాలను శిక్షకులు వారికి పూర్తిగా వివరించారు. ప్రతి పాఠశాలలోను నలుగురు విద్యార్థినులతో శక్తి వారియర్స్ బృందాలను ఏర్పాటు చేశామని సీఐ పెద్దిరెడ్డి రామచంద్రరావు తెలిపారు. కార్యక్రమంలో టైక్వాండో శిక్షకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలకు ముగిసిన శిక్షణ

పిఠాపురం రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఐసీడీఎస్ పిఠాపురం సీడీపీవో సీహెచ్ఎస్‌కే దుర్గాదేవి సూచించారు. పోషణ బీ-పడాయి బీ కార్యక్రమంలో భాగంగా పిఠాపురం మండలం చిత్రాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజులు నిర్వహించిన శిక్షణ తరగతులు గురువారం సాయంత్రం ముగిశాయి. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అవసరాలు ప్రతిబింబించేలా అభివృద్ధి ప్రణాళికలు

జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్

గొల్లప్రోలు రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అవసరాలు ప్రతిబింబించేలా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ ఆదేశించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి పంచాయతీల వారీగా అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ)ల తయారీని పరిశీలించేందుకు గొల్లప్రోలు మండలం చేబ్రోలు పంచాయతీ కార్యాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. మూడు పంచాయతీల ప్రణాళికలు తయారు కాగా మిగిలిన వాటిని వెంటనే పూర్తి చేయాలని సూచించారు. వీటి ఆధారంగా నిధుల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. డీపీవో వెంట ఈవోపీఆర్డీ కుమార్, పంచాయతీల కార్యదర్శులు శ్రీనివాస్, రాజు ఉన్నారు.



చేబ్రోలులో అభివృద్ధి ప్రణాళిక తయారీని పరిశీలిస్తున్న డీపీవో రవికుమార్

పారిశుధ్య కార్మికుల ధర్నా

గొల్లప్రోలు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు కుంచే చిన్నా మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు పనిచేసేందుకు సామాన్లు, యూనిఫారం అందించాలన్నారు. ఇనుప చక్రాల బళ్లకు తక్షణం మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. కంటి పరీక్ష పద్ధతిలో హాజరు కాకుండా పాత మస్తరు విధానం అమలు చేయాలని, నాలుగేళ్ల క్రితం చనిపోయిన పారిశుధ్య కార్మికుడు బంగారు రాముకు రావాల్సిన రూ.2లక్షలను తక్షణం చెల్లించాలని కోరారు. అనంతరం నగర పంచాయతీ మేనేజరుకు వినతపత్రం అందజేశారు. ఆందోళనలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

'ట్రాఫిక్ నిబంధనలు పాటించండి... సురక్షితంగా గమ్యం చేరండి'

కాకినాడ క్రైం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించడం ద్వారా వాహనచోదకులు సురక్షితంగా గమ్యాలకు చేరవచ్చని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) సూచించారు. గురువారం ఆయన ట్రాఫిక్ సీఐ ఎన్.రమేష్, వన్ టౌన్ లా అండ్ ఆర్డర్ సీఐ ఎం.నాగదుర్గారావు, సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి స్కూలు పిల్లలను, ప్యాసింజర్లను ఎక్కించరాదన్నారు. అనంతరం హెల్మెట్ ధరించి వాహనాలపై వెళ్తున్న వారిని ఎమ్మెల్యే కొండబాబు, పోలీసు సిబ్బంది ఆపి అభినందిస్తూ వారికి గులాబీలు, యాపిల్స్ అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

గొల్లప్రోలు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మరణించాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు కరణంగారి తోటకు చెందిన కిరాణా వ్యాపారి అనిశెట్టి శ్రీనివాస్ (52) భార్య ఏసమ్మతో కలిసి ఈ నెల 23న పెద్దాపురం మండలం దివిలి వద్ద గల చిన తిరుపతికి దర్శనం నిమిత్తం బయలుదేరాడు. బైపాస్ రోడ్డులో కుక్క అడ్డు రావడంతో తప్పించబోయి ఇద్దరూ బైక్‌పై నుంచి పడిపోగా తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా శ్రీనివాస్ మరణించాడు. శ్రీనివాస్ కుమారుడు దుర్గాప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శ్రీనివాస్‌కు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నేడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాక

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ శుక్రవారం కాకినాడ రానున్నారు. ఉదయం పది గంటలకు కలెక్టరేట్‌లో జరిగే జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొంటారని కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు.

ఉపకార వేతనాల పంపిణీ

కాకినాడ సిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సామాజిక కార్యక్రమంలో భాగంగా మలబార్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన నగర పరిధిలోని 107 మంది బాలికలకు రూ.10 లక్షల విలువైన ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. దేవాలయం వీధిలోని షోరూమ్ వద్ద వీటిని అందజేసినట్టు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్ హెడ్ ఉండమట్ల సాయి శ్రీకాంత్ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

గొల్లప్రోలు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేట రామాలయం వద్ద గురువారం గొల్లప్రోలు టీమ్ రామచరణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పిఠాపురం కార్తికేయ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మొగలి కాశీవిశ్వనాథం, డాక్టర్ కొమ్మూరి గోవిందబాబు, వై.ఆలీస్ ఎలియానోర్, డాక్టర్ కందుల శ్రీనివాస్ ప్రజలను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సినీ నటుడు రామచరణ్ పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన శిబిరంలో ఫౌండేషన్ ప్రతినిధులు, జనసేన నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

కలెక్టర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ షాన్ మోహన్‌ను పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ గురువారం రాత్రి కలిశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్, టీడీపీ అధినాయకత్వం ఆదేశాల మేరకు పిఠాపురంలో నిర్వహించిన 'కార్యకర్తే అధినేత' కార్యక్రమంలో భాగంగా కార్యకర్తల నుంచి వివిధ అంశాలపై అందిన 102 వినతులు, ఫిర్యాదులను కలెక్టరుకు అందజేసి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉగాది పర్వదినాన సాంస్కృతిక పోటీలు

కాకినాడ సిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఉగాదిని పురస్కరించుకుని తెలుగు తత్వాన్ని, సాంస్కృతిక మూలాలను సమాజానికి చాటేలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆది గురు యోగ పీఠాధిపతి సద్గురు సచ్చిదానంద యోగి పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉగాది పండుగ రోజున సాయంత్రం ఐదు గంటలకు పీఠం వద్ద పంచాంగ శ్రవణంతో పాటు చిన్నారులకు పద్యధారణ, పిల్లలు, స్త్రీలు, పురుషులకు సంప్రదాయ వస్త్రధారణ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పీఠం సభ్యుడు ఎం.లక్ష్మీనారాయణ కోరారు.

నూకాలమ్మ జాతర నిర్వహణపై వివాదం

కోలంకలో పోలీసు బందోబస్తు ఏర్పాటు

పిఠాపురం రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం కోలంకలో నూకాలమ్మ జాతర నిర్వహణపై గురువారం సాయంత్రం వివాదం నెలకొంది. జాతర వద్ద ఏర్పాటు చేసే బోర్డుల్లో నాయకుల ఫొటోల విషయంపై టీడీపీ, జనసేన నాయకుల మధ్య వివాదం నెలకొన్నట్టు చెప్తున్నారు. ఫ్లెక్సీలు, బోర్డుల్లో గతం నుంచీ వస్తున్న సంప్రదాయాన్నే పాటిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాలు వివాదానికి దిగే అవకాశం ఉందని గ్రామస్తులు 100కి ఫోను చేయడంతో గ్రామంలో పోలీసులు మోహరించారు. జాతరను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పోలీసులు సూచించారు.

'అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ'

రౌతులపూడి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అభివృద్ధికి కృషి చేస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ పైలసాంబశివరావు అన్నారు. రౌతులపూడిలో టీడీపీ మండల అధ్యక్షుడు తమరాల సత్యనారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పైల పైడిరాజు, గొల్లు పెద్దదివాణం, జేట్లా రాజా, లాలం అప్పలనాయుడు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

పన్నులు చెల్లింపునకు 31 వరకు గడువు

ఏలేశ్వరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో వివిధ పన్నులు చెల్లించడానికి ఈనెల 31 వరకు గడువు ఉన్నట్లు గురువారం కమిషనర్ సత్యనారాయణ తెలిపారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

అంగన్‌వాడీ సహాయకుల
పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

వై.రామవరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మారేడుమిల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో వై.రామవరం మండలంలో అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులు భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మారేడుమిల్లి ఐసీడీఎస్ సీడీపీవో పీఎస్ ప్రసన్న తెలిపారు. పీఎం జనమన్ పథకంలో భాగంగా వై.రామవరం మండలంలోని చింతలపూడి పంచాయతీలో భీమునిగడ్డ, దారగడ్డ పంచాయతీలో పాముగొంది, బొడ్డగండి పంచాయతీలో నాగలోవ గ్రామాల్లో అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఈనెల 26నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆమె తెలిపారు. అభ్యర్థులు ఎస్టీ మహిళా అభ్యర్థి అయి ఉండాలని, పదోతరగతి ఉత్తీర్ణత లేదా తదుపరి ఎక్కువ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 21నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలు నకళ్ల గెజిటెడ్ అధికారితో ఎటాస్టేషన్ చేయించి వచ్చేనెల 10వ తేదీ సాయంత్రం 5గంటలలోపు మారేడుమిల్లి కార్యాలయంలో అందించాలన్నారు. ఆయా పోస్టుల కోసం అభ్యర్థినులు ఆసక్తి కనబరచాలని సూచించారు.

ఆసుపత్రిలో ఏపీ వైద్యసేవల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తనిఖీ



వై.రామవరం ఆసుపత్రిలో తనిఖీ చేస్తున్న క్వాలిటీ కంట్రోల్ ఈఈ విజయలక్ష్మి, రక్తదాన శిబిరంలో పాల్గొన్న వైద్యులు, పోలీసులు

వై.రామవరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వైద్యసేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థకు సంబంధించిన క్వాలిటీ కంట్రోల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏలూరు) ఎం. విజయలక్ష్మి గురువారం వై.రామవరం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ప్రభుత్వం కల్పించిన ఆక్సిజన్ కనెక్టివిటీని పరిశీలించి అవి సక్రమంగా పనిచేస్తున్నాయి లేనిది తనిఖీ చేశారు. ప్రసూతి, అత్యవసర విభాగం, చిన్నపిల్లల వార్డుల్లో ఆక్సీ జన్ సదుపాయాలు తనిఖీలపై ఆమె సమీక్షించారు. ఆసుపత్రిలో నెలకొన్న పలు సమస్యలను గుర్తించి వాటి నివేదికలను ఉన్నతాధికారులకు అందిస్తామని ఆమె తెలిపారు. ఆమె వెంట సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరంలో పాల్గొన్న దాతలు

వై.రామవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో స్థానిక ఎస్ఐ రామకృష్ణ, సీఆర్‌పీఎఫ్ పోలీసులు, ఆసుపత్రి వైద్యులు పాల్గొని రక్తాన్ని ఇచ్చారు. 20 మంది బ్లడ్ డొనేట్ చేసినట్లు డాక్టర్ రాహుల్ తెలిపారు. తమ ఆసుపత్రిలో అత్యవసర పరిస్థితుల్లో రక్తాన్ని స్టోరేజ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

యోగా సరే.. మెగా ఎప్పుడు?

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ఆదివాసీ నాయకులు

అడ్డతీగల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): 20వేల గిరిజన విద్యార్థులతో మెగా యోగా సరేకానీ మరి గిరిజన యువతకు మెగా డీఎస్సీ ఎప్పుడని ఆదివాసీ సంఘాల కూటమి నాయకులు వెదుళ్ళ లచ్చిరెడ్డి, తీగల బాబూరావు, ప్రభుత్వాన్ని ఘాటుగా ప్రశ్నిస్తున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 7న 20వేల మంది గిరిజన విద్యార్థులతో సూర్య నమస్కారం పేరిట మెగా యోగా కార్యక్రమం నిర్వహించడం మంచిదే. కానీ యోగా ఎవరు చేస్తారో ఆవ్యక్తి ఆరోగ్యం మాత్రమే బాగుంటుంది. అలా అని మిగిలిన వారి ఆరోగ్యాలు బాగుం డవా అని ప్రశ్నించారు. యోగా చేసిన చేయకపోయిన మా బ్రతుకులు మారవని, మా పూర్వీకులు ఎవరూ యోగాలు చేయకపోయిన ప్పటికీ వారు ఆరోగ్యంగానే ఉన్నారన్నారు మెగా యోగా సరే మాకు కావలసింది గిన్నీస్ రికార్డ్ కాదు... గిరిజన బ్రతుకులు మార్చండని ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెదుళ్ళ లచ్చిరెడ్డి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్య క్షుడు తీగల బాబూరావు ఓ ప్రకటనలో ప్రభుత్వానికి సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో తగిన గుణపాఠం చెబుతామని మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు.

'సభ్యత్వాల పెంపు పార్టీకి బలం'



సభ్యత్వాల కార్డులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ఎటపాక, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం నియోజకవర్గంలో ఈసారి సభ్యత్వాల పెంపులో ఎటపాక రెండోస్థానంలో నిలిచిందని, దాంతో టీడీపీకి క్యాడర్ బలం చేకూర్చిందని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు, సీనియర్ నాయకులు కిలారు వెంకటేశ్వరరావు, నలజాల శ్రీకాంత్ చౌదరి అన్నారు. గురువారం మండల కేంద్రమైన ఎటపాకలో ఇటీవల టీడీపీ సభ్యత్వాలు నమోదు చేసుకున్న కార్యకర్తలు, శ్రేణులకు సభ్యత్వాల డిజిటల్ కార్డులను పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 5,405మంది ఇటీవల సభ్యత్వాలు నమోదు చేసుకున్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు పూరేటి వెంకటేశ్వరరావు, పాటి చలపతి, దానే రాజు, పాటి సంపత్, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

గండి పోశమ్మను దర్శించిన ఎమ్మెల్యే దంపతులు



దేవీపట్నం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఉన్న మాతృశ్రీ గండిపోశమ్మ అ మ్మవారిని గురువారం రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, భాస్కర్ దంపతులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ సిబ్బంది స్వాగతం పలికి శాలువాతో సత్కరించి అమ్మవారి ఫోటో, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈనెల లో జరిగే అమ్మవారి ఉత్సవాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

జామ్ మసీదులో ఇఫ్తార్ విందు

మోతుగూడెం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): డొంకరాయి జామ్ మసీదులో ఇఫ్తార్ విందు నిర్వహించారు. డొంకరాయి ఎస్ఐ శివకుమార్ రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులందరికీ జామ్ మసీదులు నమాజులు నిర్వహించి వారందరికీ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎస్ఐ శివకుమార్ తదితరులు



సీఎం చంద్రబాబును కలిసి విన్నవిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

సీఎంను కలిసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు పనులపై సమీక్ష సమావేశం నిర్వహించేందుకు పోలవరం విచ్చేసిన సీఎం చంద్రబాబు ను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కలిశారు. పుష్కర ఎత్తిపోతల పథకం అంతర్భాగం తాళ్లూరు లిఫ్టుకు ఐరన్‌పైపులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. కాగా, పోలవరం నిర్వాసితుల సభ సందర్భంగా జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ చేసిన సేవా కార్యక్రమాలను తెలుసుకున్న సీఎం చంద్రబాబు ఆయన సేవలను అభినందించారు.



సీఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే దివ్య

సీఎం సహాయ నిధి పంపిణీ

తుని రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి దోహదపడుతుందని ప్రభుత్వ విప్ తుని ఎమ్మెల్యే యనమల దివ్య స్పష్టం చేశారు. ఈ మేరకు తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో సహాయనిధి నుంచి మంజూరైన రూ.28.55లక్షల నగదు చెక్కులను అందజేశారు. టీడీపీ యువ నాయకులు యనమల రాజేష్, చింతమనీడి నాగ సోమరాజు(అబ్బాయి), సుర్ల లోవరాజు, తమరాన సత్యనారాయణ పాల్గొన్నారు.

'లక్ష్యాలకు అనుగుణంగా రుణాలు మంజూరు చేయాలి'

తుని రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకులో రుణాలు మంజూరు చేయాలని ఎంపీడీవో సాయి నవీన్ స్పష్టం చేశారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన వివిధ కార్పొరేషన్ల అంచనాలకు అనుగుణంగా బ్యాంకుల రుణాలు మంజూరుకు పలు సూచనలు ఇచ్చారు.



మాట్లాడుతున్న సీడీపీవో పూర్ణిమ

అంగన్‌వాడీలకు ముగిసిన శిక్షణ

కిర్లంపూడి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీపీ మెయిన్ పాఠశాలలో అంగన్వాడీ టీచర్లకు ఇస్తున్న శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. చిల్లంగి, కిర్లంపూడి సెక్టార్ పరిధిలో 44మందికి సూపర్‌వైజర్లు జి.సునీత, బూసమ్మ శిక్షణ ఇచ్చారు. జగ్గంపేట సీడీపీవో ఎం.పూర్ణిమ పాల్గొన్నారు.

ఏలూరులో భూపాదాలమ్మకు ప్రత్యేక పూజలు

ప్రత్తిపాడు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏలూరు గ్రామంలో భూపాదాలమ్మ తల్లికి గురువారం 3వవార్షికోత్సవ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. 510ఏళ్ల క్రితం కొలువైన భూపాలమ్మకు మూడేళ్ల క్రితం ఆలయం నిర్మించి గ్రామస్తులు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు, ఎంపీపీ గోళ్ల సుధాకర్ పూజలు చేశారు.

నవోదయకు ముగ్గురు విద్యార్థుల ఎంపిక



కొల్లు లేనీషా



పనితి విన్సీక

ఎటపాక, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నవోదయలో ఆరో తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్షా ఫలితాల్లో ఎటపాక మండలం నుంచి ముగ్గురు విద్యార్థులు నవోదయ పాఠశాలకు ఎంపికయ్యారు. పాలమడుగు ఎంపీపీఎస్ నుంచి బండి లాస్య, బాసవాగు ఎంపీపీఎస్ నుంచి కొల్లు లేనిషా, లక్ష్మీపురం ఎంపీపీఎస్ నుంచి పనితి విన్సీక ఎంపికయ్యారు. వీరిని ఎంఈవో సరియం రాజులు అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

'ప్రత్తిపాడు రోడ్లకు మహర్దశ'

ప్రత్తిపాడు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టిన 9నెలల్లోనే ప్రత్తిపాడు నియోజకవర్గానికి మహర్దశ పట్టిందని, ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కృషి మేరకు నియోజకవర్గంలో రూ.55కోట్ల అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని టీడీపీ నాయకులు తెలిపారు. టీడీపీ కార్యాలయం వద్ద మండల కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అమరాది వెంకట్రావు, జింకల ఫకీర్ మాట్లాడారు. సమావేశంలో నాయకులు కొమ్ముల కన్నబాబు, పల్లా గోపి, సత్యంశెట్టి సీతబాబు, రామిశెట్టి మునిసీబు, దాకారపు కృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బద్ది రామారావు

'అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం'

శంఖవరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు బద్ది రామారావు అన్నారు. మండలంలో రోడ్లకు భారీస్థాయిలో నిధులను ప్రభుత్వం విడుదల చేసిన సందర్భంగా మండలంలో ముఖ్యనేతలందరూ సీతంపేట యాదవ కమ్యూనిటీ హాలులో గురువారం విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కత్తిపూడి-వజ్రకూటం, కొంతంగి నుండి కొత్తపల్లి రోడ్లతోపాటు మండలంలో పలు గ్రామాలకు భారీస్థాయిలో నిధులను విడుదల చేయడంలో కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెన్నా శివ, తెలుగు యువత అధ్యక్షుడు కీర్తి వెంకట సుభాష్, బొమ్మిడి సత్తిబాబు, పిర్ల అప్పారావు, పోలం చిన్నా, జనసేన నేత కరణం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఆదిత్యలో అలరించిన సంగీత కచేరి



ఆదిత్యలో నిర్వహిస్తున్న సంగీత కచేరి

గండేపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో స్పిక్ మకాయ్ ఆధ్వర్యంలో సంగీత కచేరి ఏర్పాటు చేశారు. చెన్నైకు చెందిన ప్రముఖ వాయిద్య విద్వాంసులు ఎంఎస్ఎన్ రమేష్(వీణ), కుంభకోణం కె.స్వామినాథన్(మృదంగం), ఎన్.రాజారామన్(ఘటం) వాయిద్యాలతో అలరించారు. ఈ కార్యక్రమాన్ని యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్, వైస్ ఛాన్సలర్లు ప్రారంభించారు.

రాచపల్లిలో బసవేశ్వరునికి 21 ద్రవ్యాలతో అభిషేకాలు

ప్రత్తిపాడు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రాచపల్లిలోని అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వర స్వామి ఆలయంలోని బసవేశ్వరస్వామికి గురువారం 21 ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. కాకినాడకు చెందిన వట్టూరి లక్ష్మణరావు, రాణి, దంపతులు, కుటుంబ సభ్యులతో బసవేశ్వర స్వామికి వివిధ రకాల ద్రవ్యాలతో ఘనంగా నిర్వహించారు.

ప్రకృతి వ్యవసాయంపై సమావేశం

గండేపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఏవో సద్గురుమూర్తి అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు 2025-26 ఖరీఫ్ ప్రణాళిక చేసేందుకు మండల స్థాయి వివిధ శాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా కోఆర్డినేటర్ వై.గణేష్, మాస్టర్ ట్రైనర్ బాస్కరరావు, కె.మహేష్, రమ్య పాల్గొన్నారు.

మజ్జిగ, మంచినీళ్ల చలివేంద్రం ప్రారంభం

జగ్గంపేట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్, గ్రామ పంచాయతీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన మజ్జిగ, మంచినీళ్ల చలివేంద్రాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, పాండ్రంగిరాంబాబు, దేవరపల్లి మూర్తి, పంచాయతీ సెక్రటరీ శివ, ఎంపీడీవో చంద్రశేఖర్, ఈవోపీఆర్డీ భాస్కరరావు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్



దొండవాక ఉపసర్పంచ్‌గా సత్యనారాయణ

తుని రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): దొండవాక పంచాయతీలో ఉపసర్పంచ్‌గా 8వ వార్డు మెంబర్ ఆదాడ సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి సత్యనారాయణ గురువారం ప్రకటించారు.

పైడికొండ ఉపసర్పంచ్‌గా సత్యవతి

తొండంగి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పైడికొండ ఉపసర్పంచ్‌గా ఊటకోట సత్యవతి(టీడీపీ) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎంపీడీవో రాజేశ్వర్రావు తెలిపారు. ఎన్నికల అధికారిగా విచ్చేసిన తుని ఈవోపీఆర్డీ జి.మరిడయ్య పంచాయతీ కార్యాలయంలో గురువారం ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించారన్నారు. 11వవార్డు మెంబరు సత్యవతిని సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేస్తున్న చంద్రబాబుకు కృతజ్ఞతలు



సమస్యలు వివరిస్తున్న ఎడవిల్లి భాస్కరరావు

కూనవరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఒక వైపు ప్రాజెక్టు పనులతో పాటు మరో వైపు నిర్వాసితులకు న్యాయంచేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు టీడీపీ అరకు పార్లమెంటు ప్రతినిధి ఎడవిల్లి భాస్కరరావు అన్నారు. గురువారం పోలవరం ప్రాజెక్టును సందర్శించిన సీఎం చంద్రబాబు ఎదుట రంపచోడవరం నియోజకవర్గం తరుపున ని ర్వాసితుల పక్షాన ఎడవిల్లి భాస్కరరావు మాట్లాడారు. కూనవరం మండలంలో 48గ్రామాలు ముంపు గ్రామాల్లో ఉన్నాయని గతంలో నోటిఫికేషన్లు వచ్చిన గ్రామాలకు సైతం పరిహారం చెల్లించాలన్నారు. అదేవిధంగా కొంత మంది ఉపాధి కోసం బయటకు వెళ్లారని వారి పేర్లను తొలగించాలని వారికి కూడా పరిహారం చెల్లించాలని ఈసందర్భంగా చంద్రబాబుకు భాస్కరరావు విజ్ఞప్తి చేశారు.

ప్రశాంతంగా గ్రామసభ



నిర్వాసితులతో కిక్కిరిసిన గ్రామసభ

కూనవరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్వహించిన స్ట్రెక్చర్ వాల్యూఏషన్‌కు సంబంధించిన పోలవరం సభ ప్రశాంతంగా జరిగింది. నిర్వాసితులు తమ దరఖాస్తులను పోలవరం అధికారులకు అందజేశా రు. తమ ఇంటి విలువలు తక్కువ వచ్చా యని మరికొందరు, తమ పేర్లు రాలేదని మరికొందరు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమగ్ర విచారణ చేసి నిర్వాసితులకు న్యాయం చేస్తామని ఈసందర్భంగా పోలవరం ఎస్‌డీసీ నరసరయ్య నిర్వాసితులకు హామీ ఇచ్చారు. మరో రెండు రోజులపాటు శుక్ర, శని, ఆదివారాల్లో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తామని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.

విద్యా సంస్థలకు పోలీసుల నోటీసులు

జగ్గంపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న విద్యాసంస్థలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఆయా సంస్థల బస్సులవల్ల ప్రమాదాలు జరుగుతున్నందున ఈ నోటీసులు పంపారు. విద్యార్థులను తీసుకెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ నోటీసులు ఇచ్చారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

జగ్గంపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండల సర్వసభ్య సమావేశంలో శనివారం మధ్యాహ్నం 3గంటలకు జరుగుతుందని మండల పరిషత్ అధ్యక్షుడు అత్తులూరి నాగబాబు తెలిపారు. దీనికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పాల్గొంటారన్నారు.

ఉపాధి హామీ పథకం అవినీతిపై విచారణ

కోటనందూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో కేవో అగ్రహారం, జగన్నాథపురం, టీజేనగరంల్లో జరిగిన అవినీతిపై ఏపీడీ జగదాంబ విచారణ చేపట్టారు. ఈ గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌లు అవినీతికి పాల్పడినట్టు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు.

ఏలేశ్వరంలో మజ్జిగ పంపిణీ

ఏలేశ్వరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మెయిన్‌రోడ్డులో బాటసారులకు ప్రకృతి పర్యావరణ సంఘం సభ్యుడు తాళ్లూరి గొల్లాజీ, వరుపుల చిట్టిబాబు సహకారంతో సంఘం అధ్యక్షుడు సఖిరెడ్డి విజయబాబు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు.

చలివేంద్రం ప్రారంభం

జగ్గంపేట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం రామవరం నేషనల్ హైవేపై శ్రీమణికంఠ ఎంటర్‌ప్రైజెస్ అధినేత ఎం.వెంకటేశ్వరరావు శేషారత్నం దంపతులు పెళ్లిరోజు పురస్కరించుకుని దివంగత మండలపాక కన్నబ్బాయి మెమోరియల్ చలివేంద్రం ప్రారంభించారు.

'మండలానికి రూ.4.17కోట్ల నిధులు'

ఏలేశ్వరం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ మండలాభివృద్ధికి రూ.4.17 కోట్ల నిధుల కేటాయించారన్నారు.

సిరిపురంలో ఆంక్షలతో జాతర

ఏలేశ్వరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సిరిపురంలో శ్రీనూకాలమ్మ జాతరను అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కమిటీ సభ్యులకు ఆంక్షలు విధించారు. జాతర, తీర్థం సంప్రదాయ పద్ధతిలో నిర్వహించాలని సీఐ సూర్యఅప్పారావు, ఎస్ఐ రామలింగేశ్వరరావు సూచించారు.

నేటి నుంచి నూకాలమ్మఉత్సవాలు

కిర్లంపూడి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కిర్లంపూడిలో శుక్రవారం నుంచి నూకాలమ్మ తల్లి జాతర జరగనుంది. ఆలయ వ్యవస్థాపకులు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

కంటి వైద్య శిబిరం

తుని రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): తునిలో నిర్వహించే ఉచిత కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగ చేసుకోవాలని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యనమల దివ్య స్పష్టం చేశారు. ఈ మేరకు టీడీపీ నాయకులతో కలిసి తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ తుని పట్టణ అధ్యక్షులు యినిగంటి సత్యనారాయణ, డాక్టర్ గంటల చెన్నారావు పాల్గొన్నారు.

భూ వివాద సమస్య పరిష్కారం

ప్రత్తిపాడు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాండవుల పాలెం గిరిజన గ్రామంలో ఇరటా లక్ష్మి అనే మహిళ భూవివాదం పరిష్కారమైంది. తమ భూమిలోకి తనను వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నారని ఆమె ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియా వేదికగా వీడియో విడుదల చేయగా అది వైరల్ అయింది. దీంతో ప్రత్తిపాడు సీఐ బి.సూర్యఅప్పారావు, రెవెన్యూ సిబ్బంది స్పందించి గురువారం సమస్యను పరిష్కరించారు.